ప్రజాశక్తి

గురువారం 11 ఏప్రిల్ 2024 పేజీలు 8



విజయనగరం



పార్వతీపురం మన్యం

ఎన్నికల్లో ఎవరికి నచ్చినట్టు వారు ఖర్చు చేద్దామంటే కుదరదు. ప్రతి ఖర్చుకూ ఓ లెక్కుంది. ఆ పరిమితి మీరితే చిక్కు కూడా ఉంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం నిబంధనావళి మేరకు జిల్లా ఎన్నికల అధికారి (కలెక్టర్) నేతృత్వంలో నిరంతర నిఘా నేత్రాలు ఉన్నాయి. వివిధ పేర్లతో ప్రత్యేక బృందాలు జిల్లాలో పర్యవేక్షిస్తున్నాయి. అభ్యర్థులే కాదు. ఎవరైనా తగిన ఆధారాలు లేకుండా బస్సులు, రైలు, ఇతర ప్రైవేటు వాహనాల్లో నగదు, వివిధ రకాల వస్తుసామగ్రి, మద్యం తరలించడానికి వీలు లేదు. అనుమానం వస్తే చాలు సీజ్‌చేసే అధికారం పోలీసులతో పాటు ఆయా బృందాలకు ఎన్నికల సంఘం కల్పించింది. కానీ, బృందాల నిఘా సరిపోవడం లేదు. వీరి పనితీరు పట్ల సాక్షాత్తు జిల్లా ఎన్నికల అధికారి కూడా ఇటీవల జరిగిన సమావేశంలో అసంతృప్తి వ్యక్తం చేయడమే ఇందుకు తార్కాణం.

69 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు

జిల్లాలోని ప్రతి నియోజకవర్గానికి 9 చొప్పున మొత్తం 69 ఫ్లయింగ్ స్క్వాడ్స్ టీములు (ఎఫ్ఎస్‌టి) ఏర్పాటు చేశారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ టీమ్స్ (ఎంసిసి) బొబ్బిలి, ఎస్.కోట నియోజకవర్గాల్లో ఐదు చొప్పున మిగిలిన చోట్ల నలుగురు చొప్పున నియమించారు. వీరితోపాటు స్టాటిక్ సర్వైలెన్ టీమ్స్ (ఎస్ఎసి), నియోజకవర్గానికి ఇద్దరు చొప్పున వీడియో సర్వైలెన్ టీమ్స్ (విఎస్), మరో ఇద్దరేసి చొప్పున వీడియో వ్యూయింగ్ టీము (వివిటి)లు ఉన్నాయి. ఈ బృందాలు ఎన్నికల నియమావళి సక్రమంగా అమలు జరిగేలా కృషి చేస్తాయి.

- ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చుపై ప్రత్యేక నిఘా
- జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు
- రూ.80లక్షలు నగదు, రూ.కోటి విలువైన సామగ్రి సీజ్
- వ్యయం మితిమీరితే చర్యలు తప్పవంటున్న అధికారులు

ఖర్చుకో లెక్కుంది.. మీరితే చిక్కుంది..!



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో బరిలో దిగనున్న అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ముమ్మరంగా ర్యాలీలు, ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రచారంలో ప్రతిదీ ఖర్చుతో కూడుకున్న పని కావడంతో అధికార యంత్రాంగం ఎన్నికల వ్యయాన్ని లెక్కించే పనిలో నిమగ్నమైంది. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచి అభ్యర్థులు చేసే ఖర్చును పార్టీ ఖర్చుగా పరిగణిస్తారు. నామినేషన్ వేసిన రోజు నుంచి చేసే ప్రతిఖర్చూ వారి వ్యయ పరిమితిలోకి వస్తుంది. ఎంపి అభ్యర్థి రూ.90 లక్షలు, ఎంఎల్ఎ అభ్యర్థి రూ.40 లక్షల వరకు ఎన్నికల్లో ఖర్చు చేసుకోవచ్చు. ఎన్నికల సంఘం నిర్ణయించిన ఈ పరిమితి మేరకు నామినేషన్‌కు ముందు రోజే అభ్యర్థి జాతీయ బ్యాంకులో కొత్త అకౌంట్ ఓపెన్ చేసి ఆ మొత్తాన్ని డిపాజిట్ చేయాలి. నామినేషన్ తర్వాత నుంచి ర్యాలీలు, సమావేశాలు, భోజనాలు, వాహనాలు, సౌండ్ సిస్టమ్, తదితర ఎన్నికల నిమిత్తం చేసే ఖర్చులన్నింటినీ అభ్యర్థి అక్కౌంట్ నుంచి మాత్రమే చెల్లించాలి. ఈనేపథ్యంలో అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని ఎప్పటికప్పుడు ఎన్నికల ప్రత్యేక బృందాలు డేగ కళ్లతో గమనిస్తూనే ఉన్నాయి. పరిమితికి మించి ఎన్నికల వ్యయం దాటితే అభ్యర్థులకు చిక్కులు తప్పవని హెచ్చరికలు ఉన్నా అభ్యర్థులు మాత్రం ఇవేమీ పట్టించుకోవట్లేదు. ఎన్నికల సంఘం ఆదేశాలను సైతం ధిక్కరించి ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేస్తున్నారని ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా కరపత్రాల పంపిణీ, జెండాలు, భోజనాలు, ర్యాలీకి కార్లు, మోటార్ సైకిళ్లపై వచ్చినవారికి బండిలో పెట్రోల్ పోయించడం, రూ.300 నుంచి రూ.500 వరకు పంపిణీ చేయడం జరుగుతోంది. అభ్యర్థులు ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి.

నిరంతర నిఘాకు ప్రత్యేక బృందాలు

వివిధ పార్టీలు, అభ్యర్థుల కార్యకలాపాలు, ఖర్చులు తదితరాలపై ఎన్నికల సంఘం ప్రత్యేక నిఘావేసింది. ఇందుకోసం జిల్లాలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ముగ్గురు చొప్పున ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 21 మంది అసిస్టెంట్ ఎక్స్‌పెండీచర్ ఆఫీసర్ (ఎఇఒ)లను నియమించారు. ప్రతి ఎఇఒ పరిధిలోనూ మరోముగ్గురు సహాయకులు ఉంటారు. పార్లమెంట్ అభ్యర్థిపైనా అన్ని అంశాల్లో నిఘా ఉంచేందుకు 8మందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. వీరి ఆధ్వర్యాన క్షేత్ర స్థాయి సిబ్బంది కూడా ఉంటారు. వీరంతా ఎప్పటికప్పుడు రికార్డులు నిర్వహిస్తారు. నామినేషన్ నుంచి ఎన్నికలు ముగిసేలోగా మూడుసార్లు తమ వద్ద ఉన్న వివరాలతో అభ్యర్థులు చూపిన వ్యయ వివరాలతో (మిగతా..3లో)

5 నుంచి పోస్టల్ బ్యాలెట్

ప్రజాశకి- విజయనగరం కోట

ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది నుంచి నేరుగా పోస్టల్ బ్యాలెట్ల స్వీకరణ మే 5వ తేదీ నుంచి ప్రారంభించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశించారు. దీనికోసం అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్లపై రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, డిటిలకు కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. పోస్టల్ బ్యాలెట్లలో రకాలు, జారీ, స్వీకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిబంధనలను పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా వివరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోస్టల్ బ్యాలెట్‌ల స్వీకరణ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో జరుగుతుందన్నారు. సర్వీసు ఓటర్లనుంచి మాత్రమే ఆన్‌లైన్లో ప్రత్యేక ప్రక్రియ ద్వారా బ్యాలెట్ల స్వీకరణ ఉంటుందని చెప్పారు. ఎన్నికల్లో విధులు నిర్వహించే వారినుంచి, ఆబ్‌సెంటీ ఓటర్లనుంచి నేరుగా బ్యాలెట్ల స్వీకరణ జరుగుతుందని చెప్పారు. 85 ఏళ్లు పైబడినవారు, వికలాంగుల కోసం ఉద్దేశించిన హోం ఓటింగ్ ప్రక్రియను వివరించారు. పోస్టల్ బ్యాలెట్ కోసం ఎన్నికల సిబ్బంది ఈనెల 15 వ తేదీలోగా ఫారమ్ 12 లో దరఖాస్తు చేయాలని, ఈ ప్రక్రియ ఈనెల 15 నాటికి పూర్తి కావాలని చెప్పారు. నామినేషన్ల పరిశీలన పూర్తయి, అభ్యర్థులు ఖరారు అయిన వెంటనే, 2వ తేదీ నాటికి పోస్టల్ బ్యాలెట్ల ముద్రణ పూర్తి చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ల ఓటింగ్ కోసం ప్రతీ నియోజకవర్గంలో అన్ని సదుపాయాలతో ఒక ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఒక్కో కేంద్రంలో కనీసం ఐదు గదులను సిద్ధం చేయాలని తెలిపారు. పోస్టల్ ఓట్లను ధ్రువీకరించేందుకు ఇద్దరు గెజిటెడ్ అధికారులను సైతం ఏర్పాటు చేయాలన్నారు. 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు వివిధ విభాగాల అధికారులు, సిబ్బందికి నిర్ణయించిన తేదీల మేరకు పోస్టల్ బ్యాలెట్ల స్వీకరణ చేపట్టాలన్నారు. ఎన్నికల్లో విధులను నిర్వహించే పిఒలు, ఎపిఒలు, ఒపిఒలు, మైక్రో అబ్జర్వర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టేటిక్ స్క్వాడ్ సిబ్బంది, పోలీసులు, డ్రైవర్లు, వీడియో గ్రాఫర్లు తదితర ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములైన ప్రతీఒక్కరికీ పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పిస్తామన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా 33 అత్యవసర ప్రభుత్వ శాఖల సిబ్బంది కూడా పోస్టల్ బ్యాలెట్లను వినియోగించుకోవచ్చునని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్ఒ ఎస్‌డి అనిత, నోడల్ అధికారి సందీప్‌కుమార్, ఆర్ఒలు, ఎఆర్ఒలు, డిటిలు పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్, ఎస్‌పి, ఐటిడిఎ పిఒ

ఎన్నికల నిర్వహణలో లోపాలు రావద్దు

మన్యం కలెక్టర్ నిశాంత్ కుమార్

ప్రజాశక్తి-పాలకొండ

సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ ను ఎస్‌పి విక్రాంత్ పాటిల్‌తో కలిసి సందర్శించారు. ఎన్ని రూములు ఉన్నాయి, ఏ విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్ని రూట్లు ఉన్నాయని (మిగతా..3లో)

ఎన్‌సిఎస్ కార్మికులకు కుచ్చుటోపీ

ఎన్‌సిఎస్ చక్కెర కర్మాగారం కార్మికులకు యాజమాన్యం కుచ్చుటోపీ పెట్టింది. కార్మికుల కష్టంతో లాభాలు ఆర్జించిన యాజమాన్యం నష్టాల సాకు చూపి బోర్డును తిప్పేసింది. ఓ వైపు ఆస్తులను పోగుపెట్టుకొని బ్యాంకులలో తీసుకున్న రుణాలు, కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.1100 కోట్లు నష్టాలు వచ్చినట్లు చూపి ఐపి పెట్టడంతో చక్కెర పరిశ్రమ, విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఆస్తులను ఎన్‌సిఎల్‌టి స్వాధీనం చేసుకుంది. ఇది జరిగి నాలుగేళ్లు కావస్తున్నా కార్మికులకు చెల్లించాల్సిన వేతన, గ్రాట్యుటీ, పిఎఫ్ బకాయిలు చెల్లించడం లేదు. దీంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

- నాలుగేళ్లయినా కార్మికులకు చెల్లించని బకాయిలు
- దొంగచాటున మెటీరియల్ తరలింపు
- ఆందోళనలో కార్మికులు

ప్రజాశక్తి-బొబ్బిలి

పరిశ్రమలో ఉన్న విలువైన మెటీరియల్‌ను ప్లాంట్ ఇన్‌ఛార్జి దొడ్డిదారిన బయటకు తరలిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఎన్‌సిఎస్ ఆస్తులను వేలం వేసి బ్యాంకు రుణాలు, కార్మికుల బకాయిలు చెల్లించాల్సి ఉన్నప్పటికీ ఈనెల 5న ఎటువంటి అనుమతులూ లేకుండా పరిశ్రమలో ఉన్న విలువైన మెటీరియల్‌ను లారీతో బయటకు తరలించి అమ్మివేసినట్లు కార్మికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఎన్‌సిఎల్‌టి నియమించిన అధికారులకు కార్మిక సంఘ నాయకులు ఫిర్యాదు చేశారు.

కార్మికులకు రూ.20కోట్లు బకాయి

ఎన్‌సిఎస్ కార్మికులకు యాజమాన్యం రూ.20కోట్లు వరకు చెల్లించాల్సి ఉంది. 350మంది కార్మికులకు గ్రాట్యుటీ, పిఎఫ్, బోనస్, వేతనాలు బకాయి రూ.20కోట్లు వరకు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ రూ.7కోట్లు మాత్రమే బకాయిలు ఉన్నట్లు ఎన్‌సిఎల్‌టి చూపిస్తుంది. 2019, 2020 సీజన్లకు సంబంధించిన బోనస్ చెల్లించాల్సి ఉన్నప్పటికీ బకాయిలో చూపించలేదని (మిగతా..3లో)



సామగ్రిని తరలిస్తున్న లారీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎపిడి శ్రీనివాసరావు

హాజరు పట్టిక తప్పనిసరి

ప్రజాశక్తి- బాడంగి

హాజరు పట్టికను తప్పనిసరిగా గమనించాలని ఎపిడి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ అధ్యక్షతన ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పనిసరిగా ఉపాధిహామీ కూలీల హాజరు పట్టికను టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీలు, ఎపిఒలు గమనించాలని చెప్పారు. 100రోజులు పని దినాలు అందరికి పూర్తయ్యేలా చూడాలన్నారు. కొత్త పనులు వేగంగా చేపట్టాలని చెప్పారు. ఎండలు తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల వడ దెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సివై చింతామణికి నివాళి

ప్రజాశక్తి- బొబ్బిలి

జర్నలిస్ట్ పితామహుడు సివై చింతామణికు లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్, తెలగ సంక్షేమ సంఘం నాయకులు హరి ఘనంగా నివాళులర్పించారు. సివై చింతామణి జయంతి సందర్భంగా బుధవారం శ్రీకళాభారతి ఆడిటోరియం వద్ద ఉన్న సివై చింతామణి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నాడు ప్రజల పక్షాన మీడియా పని చేస్తే నేడు రాజకీయ పార్టీలకు అనుకూలంగా పని చేయడం దురదృష్టకర మన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారానికి మీడియా సంస్థలు పని చేయాలని కోరారు. పత్రికా రంగానికి చింతామణి చేసిన సేవలను కొనియాడారు. విద్యార్థులు పాల్గొన్నారు.

రాజా కళాశాలలో రేపు జాబ్‌మేళా

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక రాజా కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సిహెచ్ వీరేంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐసిఐసిఐ బ్యాంక్ నిర్వహిస్తున్న జాబ్ మేళాకు డిగ్రీలో బిఎస్సి, బీబీఏ, బిసిఎ, బికామ్ పూర్తి చేసిన విద్యార్థులు, ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులని చెప్పారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే విద్యార్థులు బయోడేటాతో పాటు సర్టిఫికేట్లు, ఆధార్ కార్డు, మార్క్స్ లిస్ట్, పాస్ పోర్ట్ సైజు ఫోటోలతో రావాలన్నారు. ఉదయం 9.30గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభం అవుతాయని, ఆసక్తి ఉన్న విద్యార్థులు హాజరు కావాలని కోరారు.


గర్భిణిని తనిఖీ చేస్తున్న వైద్యులు ధరణి

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి – వేపాడ

మండల కేంద్రంలోని పిహెచ్‌సిలో పిఎంఎస్ఎంఎ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. 42 మంది గర్భిణీలకు డాక్టర్ ఎ ధరణి వైద్య పరీక్షలు నిర్వహించి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం బాణాది సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో గర్భిణులకు భోజన సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారితోపాటు సిహెచ్ఒ ఆంజనేయులు, పిహెచ్‌సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై పన్నులు చెల్లించండి

ప్రజాశక్తి – నెల్లిమర్ల

నగర పంచాయతీలో 5శాతం రాయితీతో పన్నులు చెల్లించాలని కమిషనర్ పి బాలాజీ ప్రసాద్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి, ఖాళీస్థలం పన్నులు ఏకమొత్తంగా ఈ నెల 30లోగా చెల్లించిన వారికి 5శాతం రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మళ్లీ మాకే పట్టం : ఎంపి

పలుచోట్ల వైసిపి అభ్యర్థుల ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి- బొబ్బిలి

మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి వైసిపికే పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. మున్సిపాలిటిలోని గొల్లపల్లిలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తమకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. రానున్న ఎన్నికల్లో అభివృద్ధి, సంక్షేమానికి ఓటు వేసి వైసిపిని గెలిపించాలని కోరారు. మరోసారి వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని జోష్యం పలికారు. ప్రచారంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, వైసిపి నాయకులు మామిడి శ్రీకాంత్, తూముల భాస్కరరావు, శంబంగి వేణుగోపాలనాయుడు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పూసపాటిరేగ: కొప్పెర్లలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే

ఎంపి సమక్షంలో పంచాయితీ

మున్సిపల్ ఎన్నికల అనంతరం వైసిపి కార్యక్రమాలకు ఆ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షులు సావు కృష్ణమూర్తి, 12వ వార్డు కౌన్సిలర్ సావు శారద దూరంగా ఉన్నారు. మున్సిపల్ చైర్మన్ పదవి ఆశించినప్పటికీ వారికి కాకుండా సావు మురళికు ఇచ్చారు. దీంతో అప్పటి నుంచి వైసిపిలో ఉంటూనే వారు కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఎన్నికల ప్రచారానికి గొల్లపల్లి వెళ్లిన ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు సమక్షంలో సావు కృష్ణమూర్తి ఇంటి వద్ద పంచాయితీ జరిగింది. తన కోడలు శారదకు మున్సిపల్ చైర్మన్ పదవి ఇవ్వాలని మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపి చంద్రశేఖర్ ఆదేశిస్తే వారు చెపితే నేను ఇవ్వాలా అని మీరు అనలేదా అని ఎమ్మెల్యే శంబంగినను ఎంపి బెల్లాన ముందు సావు కృష్ణమూర్తి నిలదీశారు. మంత్రి, ఎంపి ఆదేశాలను బేఖాతరు చేసిన ఎమ్మెల్యేకు మద్దతుగా ఎలా పని చేస్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాతగొడవలను పక్కన పెట్టి వైసిపి గెలుపునకు పని చేయాలని, మీకు న్యాయం చేస్తామని ఎంపి బెల్లాన హామీ ఇవ్వడంతో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

కొప్పెర్లలో వైసిపి ఎన్నికల ప్రచారం

పూసపాటిరేగ : మండలంలోని కొప్పెర్ల, నడిపల్లి పంచాయతీలో బుధవారం వైసిపి ఎన్నికల ప్రచారం జరిగింది. నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి బొడ్డుకొండ అప్పలనాయుడు, జిల్లా వైసిపి కోశాధికారి కందుల రఘుబాబు ఇంటింటికి వెళ్లి వైసిపి చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ఎమ్మెల్యేగా తనను, సీఎంగా వైయస్ జగన్మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో వైసిపి పార్టీ అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, వైస్ ఎంపిపిలు అల్లాడి సత్యనారాయణమూర్తి, ఎన్. సత్యనారాయణరాజు, మండల జెసిఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, నాయకులు మహంతి జనార్ధన్ రావు, పుప్పాల లక్ష్మీనారాయణ, బొల్లి రమేష్, లంకలపల్లి రాజారావు, ఇనుకోటి నాగ, బావిశెట్టి నారాయణరావు, రామతీర్థం ఆలయం బోర్డ్ సభ్యులు దాడిశెట్టి త్రినాధ, తాటిచెట్ల బాబు తదితరులకు పాల్గొన్నారు.


బొబ్బిలి: ప్రచారం చేస్తున్న ఎంపి బెల్లాన, ఎమ్మెల్యే శంబంగి

జగన్ ప్రభుత్వంలో బిసిలకు మొండిచేయి

ప్రజాశక్తి – జామి

వైసిపి ప్రభుత్వంలో బిసిలకు అన్యాయమే జరిగిందని గజపతినగరం ఉమ్మడి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని విజినిగిరి గ్రామంలో టిడిపి మండల అధ్యక్షులు పోరిపిరెడ్డి స్వామి నాయుడు ఆధ్వర్యంలో విజినిగిరి మాజీ సర్పంచ్ కొమ్మినేని శ్రీనివాస్ అధ్యక్షతన జయహో బిసి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ టిడిపి హయాంలో బిసి కార్పొరేషన్ ద్వారా చేతివృత్తి, వ్యాపారం చేసుకుంటున్న బిసిలకు సబ్సిడీ లోన్లు ఇచ్చేవరని, జగన్ ప్రభుత్వంలో అవన్నీ పక్కన పెట్టేశారని విమర్శించారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కలిసి రూపొందించిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని, చంద్రబాబు ముఖ్య మంత్రి అయితేనే రాష్ట్రంలో న్యాయం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గం అధ్యక్షులు దుర్గాప్రసాద్, ఆది లక్ష్మి, జనసేన మండల అధ్యక్షులు రాంబాబు, బిసి సాధికార నాయకులు విజయ్, గంట్యాడ టిడిపి మండల అధ్యక్షులు కొండపల్లి భాస్కరనా యుడు, జామి మండల నాయకులు సూర్యారావు, అమాష అప్పారావు, జనసేన, భాజపా నాయకులు, పాల్గొన్నారు.

బొండపల్లి: రాష్ట్రంలో టిడిపి వచ్చిన తరువాతే బిసిలకు న్యాయం జరిగిందని కూటమి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని కొత్తపాలెం గ్రామంలో జయహో బిసి కార్యక్రమం జరిగింది. శ్రీనివాస్ మాట్లాడు తూ బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారంలో సము చిత స్థానం కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందన్నారు. బిసిలు తెలుగుదేశం పార్టీకి వెన్నుముక అని రానున్న ఎన్నికలలో కూటమి అభ్యర్థులను గెలిచే


జామి: కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

విధంగా ఆశీర్వదించాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎంపిపి కొండపల్లి కొండలరావు, మాజీ వైస్ ఎంపిపి బొడ్డు రాము, సర్పంచ్‌లు బొడ్డు సత్యవతి, కర్రోతు శ్రీనివాస రావు, ముదునూరు శ్రీనివాసరాజు, పార్టీ సీనియర్ నాయకులు రాపాక అచ్చం నాయుడు, ముంజేటి పార్వతి, తాడ్డి అప్పలనాయుడు, బివి రమణ, తాళ్ళపూడి రమణ, బి.సత్యనారాయణ రాజు, జెవియస్ఎన్ రాజు పాల్గొన్నారు.

టిడిపిలో చేరికలు

గంట్యాడ: మండలంలోని నరవ గ్రామంలో బుధవారం 30 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. టిడిపి మండల అధ్యక్షులు కొండపల్లి భాస్కర్‌నాయుడు ఆధ్వ ర్యంలో గజపతినగరం నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కొండ పల్లి శ్రీనివాస్ సమక్షంలో మాజీ సర్పంచ్ ఏనుగు త్రినాద్, సీనియర్ నాయకులు సుంకరి సూరిబాబు, మునగాల సూరిబాబు తదితరులు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి కొండలరావు, అల్లి విజయ్ కుమార్, రంది చిన్నరామునాయుడు, బూడి అప్పలనా యుడు, సుంకర సాయికృష్ణ, సంక్రాన పైడ్రాజు, పల్లె వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

34 శాతం రిజర్వేషన్లకు చర్యలు

రామభద్రపురం: స్థానిక సంస్థల్లో బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి చంద్రబాబు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ అన్నారు. బుధవారం జన్ని వలస గ్రామంలో ఏర్పాటు చేసిన జయహో బిసి కార్యక్రమంలో భాగంగా ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. బిసిలకు 50 సంవత్సరాలపై బడిన వారికి 4 వేల రూపా యలు పింఛను చంద్రబాబు ఇస్తారని చెప్పారు. రానున్న ఎన్నికలలో బొబ్బిలి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా బేబీ నాయనను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సర్పంచులు రవ్వ ఈశ్వరరావు, కిలపర్తి మురళి, శంకర రావు, సీతారాం, చొక్కాపు అప్పలనాయుడు, ముళ్ళు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వైసిపితో బిసిలకు అన్యాయం

బాడంగి: వైసిపి ప్రభుత్వంతో బిసిలకు తీవ్ర అన్యాయం జరిగిందని టిడిపి నాయకులు ఆరోపించారు. బుధవారం తెంటువలస గ్రామంలో సర్పంచ్ తెంటు చిరంజీవి అధ్యక్షతన జరిగిన జయహో బిసి సభలో టిడిపి నాయకులు మాట్లాడారు. రాష్ట్రంలో రాబోయేది ఎన్‌డిఎ ప్రభుత్వమని, బీసీలకు సముచిత స్థానం లభిస్తుందన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక 300కి పైగా బీసీలు చనిపోయా రన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ బీసీ సాధికార కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు, టిడిపి మండల అధ్యక్షులు తెంటు రవిబాబు, రాష్ట్ర ఎస్‌టి జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు, ఎంపిటిసి భాస్కర్ రావు, మాజీ ఎంపిపి బొంతు త్రినాద్, సర్పంచ్ ఆవు సత్యనారాయణ, ఎల్.సత్యం తుదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో యువత భవిష్యత్తు ప్రశ్నార్థకం

ప్రజాశక్తి- బొబ్బిలి

వైసిపి పాలనలో యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన అన్నారు. స్థానిక సూర్య రెసిడెన్సీలో బుధవారం టిడిపి వాణిజ్య విభాగం నాయకులు సుంకరి సాయిరమేష్ అధ్యక్షతన యువ ఓటర్లతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా బేబినాయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని విమర్శించారు. అవినీతిపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నిలదీస్తే పవన్ కళ్యాణ్ వ్యక్తిగత జీవితంపై మాట్లాడడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలో రాజకీయ విలువలు దిగజారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రోత్ సెంటర్‌లో పారిశ్రామిక అభివృద్ధి కుంటుపడిందన్నారు. స్థానికులకు 80శాతం ఉద్యోగాలు ఇస్తామని చట్టం చేసిన



ముఖాముఖిలో మాట్లాడుతున్న బేబినాయన

వైసిపి ప్రభుత్వం మైతాన్ పరిశ్రమలో పని చేసిన పాతకార్మికులను అన్యాయంగా తొలగించిందన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్ర, యువత భవిష్యత్ కోసం టిడిపి, జనసేన, బిజెపి కూటమిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. తెలుగు ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షులు తేజస్విని మాట్లాడుతూ వైసిపి పాలనలో యువత జీవితం నాశనం అవుతుందన్నారు. రాష్ట్ర యువత భవిష్యత్ కోసం కూటమిని గెలిపించాలన్నారు. యువ ఓటర్లు అడిగిన పలు ప్రశ్నలకు బేబినాయన సమాధానం చెప్పారు. కార్యక్రమంలో యువ ఓటర్లతో పాటు టిడిపి కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, పాల్గొన్నారు.

టిడిపిలో 25 కుటుంబాలు చేరిక

పట్టణంలోని తారకరామకాలనీకు చెందిన 25 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపి తీర్థం పుచ్చుకున్నాయి. వీరందరికి కూటమి అభ్యర్థి బేబినాయన కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టిడిపి కూటమి అభ్యర్థిని గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. అభివృద్ధి చేయడంలో వైసిపి విఫలమైందన్నారు. టిడిపి గెలుపునకు కలిసికట్టుగా పనిచేయాలని కోరారు.

రాష్ట్రంలో దుష్టపాలన : కళా

మోతిలాల్‌నాయుడు సహా టిడిపిలో చేరిన పలు కుటుంబాలు



పార్టీలో చేరిన వారికి కండువా వేస్తున్న కళావెంకటరావు

ప్రజాశక్తి-మెరకముడిదాం

రాష్ట్రంలో వైసిపి హయాంలో దుష్టపాలన సాగుతోందని, ఈ పాలనకు చరమగీతం పాడాలని చీపురుపల్లి టిడిపి అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు అన్నారు. గురువారం మండలానికి చెందిన మాజీ ఎంపిపి కోట్ల మోతిలాల్‌నాయుడు, ఆయన సోదరుడు కృష్ణమూర్తి నాయుడుతో పాటు సుమారు 200 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. వీరిలో పులిగుమ్మిసర్పంచ్ తలచుట్ల ఈశ్వరరావు ఉన్నారు. వీరందరికీ కండువాలు వేసి పార్టీలోకి కళా వెంకటరావు ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్ ఐదేళ్ల పాలనలో ప్రజలకు ముద్దులు పెడుతూ గుద్దులు గుద్దారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, ఉద్యోగ అవకాశాలు లేక నిరుద్యోగం పెరిగిపోయిందని అన్నారు. తల్లిని, చెల్లిని చూడనివారు రాష్ట్ర ప్రజలకు ఏం మంచి చేస్తారని అన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మంచి నాయకత్వాన్ని ఎన్నుకోవాలని కోరారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే సూపర్ సిక్సు పథకాలు అమలు చేస్తామని, మహిళలకు ప్రత్యేక నిధి ఏర్పాటు చేస్తామని చెప్పారు. మోతీలాల్‌నాయుడు మాట్లాడుతూ తాను ఎవరికీ భయపడేది లేదన్నారు. తనను ఎంతో అవమానించారని, భయభ్రాంతులకు గురి చేశారని తెలిపారు. అయినా టిడిపిలోనే జీవితాంతం కొనసాగుతానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు గద్దె బాబూరావు, తెంటు లక్ష్మునాయుడు, బిజెపి నాయకులు ఇప్పిలి నీలకంఠం, సరిది రామునాయుడు, మండల టిడిపి అధ్యక్షులు తాడి సన్యాసినాయుడు పాల్గొన్నారు.

ఇవిఎంల బాధ్యత రిటర్నింగ్ అధికారులదే

భద్రత గదుల్లో సి సి కెమెరాలు ఏర్పాటు చేయాలి : కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఇవిఎంలను ర్యాండమైజేషన్ చేసి అప్పగించిన దగ్గర నుండి పూర్తి బాధ్యత రిటర్నింగ్ అధికారులదేనని జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి స్పష్టం చేసారు. ఇవిఎంలను భద్ర పరచిన గదుల్లో 24/7 సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం ఆర్ఒలు, ఎఆర్ఒలు, సెక్టార్ అధికారులకు ఇవిఎంల నిర్వహణ పై శిక్షణ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 12న ఇవిఎంల మొదటి ర్యాండమైజేషన్ జరుగుతుందని, అనంతరం ఇవిఎంలను ఆర్ఒలకు అప్పగిస్తామని తెలిపారు. ఇవిఎంలు ఉన్న గదులకు డబుల్ లాకింగ్ విధానం ఉండాలని, వాటిని తెరిచిన ప్రతి సారి వీడియో కవరేజ్ చేయాలని, రాజకీయ ప్రతినిధుల సమక్షం లోనే తెరవాలని అన్నారు. ప్రతి ఇవిఎంలో మాక్ వోటింగ్ చేయాలనీ, 5 శాతం ఇవిఎంల పైన వెయ్యి ఓట్లను మాక్ పోలింగ్ నిర్వహించాలని తెలిపారు. ఈ వి ఎం లను భద్ర పరచిన గదుల వద్ద తగు బందో బస్తు ను ఏర్పాటు చేసుకోవాలని, హాల్ లోపలకు ఎ ఒక్కరు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలతో వెళ్లకూడదని తెలిపారు. ఎవరెవరు ఎప్పుడెప్పుడు వెళ్తున్నదీ రిజిస్టర్ లో నమోదు చేయాలన్నారు. ఇవిఎంల నోడల్ అధికారి ఉమా శంకర్ ఇవిఎంల వినియోగం పై పవర్ పాయింట్ ద్వారా వివరించి అనంతరం వీడియో ద్వారా అవగాహన కలిగించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, డిఆర్ఒ అనిత, ఇవిఎంల నోడల్ అధికారి డిఆర్‌డిఎ పీడీ కల్యాణ చక్రవర్తి, ఆర్ఒలు, పోస్టల్ బాలెట్ ఇంచార్జ్ డిబిసికె సందీప్ పాల్గొన్నారు.

శిక్షణ కోసం ఇవిఎంల కేటాయింపు

నెల్లిమర్ల : ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికల శిక్షణ కోసం ఇవిఎంల కేటాయింపు జరిగింది. స్థానిక ఇవిఎం గోదాముల్లో ఈ కార్యక్రమాన్ని, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి బుధవారం నిర్వహించారు. ఒక్కో నియోజకవర్గానికి పది ఇవిఎం మిషన్లను అందించనున్నారు. వీటిలో ఐదు ఇవిఎంలను అసెంబ్లీ ఎన్నికలకు, మరో ఐదు మిషన్లను పార్లమెంటు ఎన్నికలకు శిక్షణ కోసం వినియోగిస్తారు. వీటి ద్వారా ఎన్నికల అధికారులకు ప్రత్యక్షంగా శిక్షణ ఇస్తారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్ఒ ఎస్‌డి అనిత, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, ఇవిఎంల నోడల్ అధికారి బి.ఉమాశంకర్, డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, ఎన్నికల సూపరింటిండెంట్ ప్రభాకర్, నెల్లిమర్ల తాహశీల్దార్ రామరాజు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఖర్చుకో లెక్కుంది.. మీరితే చిక్కుంది..!

(మొదటి పేజీ తరువాయి)

సరిపోల్చి చూస్తారు. అభ్యర్థులు వ్యయం తక్కువ చూపిస్తే తమ వద్ద ఉన్న ఆధారాలను వారికి చూపించి సరిచేయిస్తారు. ఎన్నికల ఫలితాలు వెల్లడించిన నాటి నుంచి నెలరోజుల్లోగా అభ్యర్థులు తమ పూర్తి ఖర్చుల వివరాలు, వాటి బిల్లులను అందించాలి. ప్రచారంలో భాగంగా ఏదైనా ర్యాలీ నిర్వహించినప్పుడు వీడియో తీసి ఎన్ని ఆటోలు, కార్లు, మోటారు సైకిళ్లు ఉన్నాయి, ఫ్లెక్సీలు, లౌడ్ స్పీకర్లతోపాటు జెండాలు, కండువాలు, పోస్టర్లు, కరపత్రాలు తదితర ఎన్నికల సామగ్రి ఎన్ని ఉన్నాయి, భోజనాల ఖర్చు ఎంత తదితర అంశాలను పరిశీలించి జిల్లా కమిటీ విడుదల చేసిన స్టాండర్డ్ రేట్స్ ఛార్ట్ ప్రకారం ఖర్చును లెక్కిస్తారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాల్లో ప్రకటనలు, పెయిడ్ ఆర్టికల్స్ చేసే ఖర్చును అభ్యర్థుల ఎన్నికల వ్యయంలోకి తీసుకుంటారు. పరిమితికి మించి ఖర్చు చేసినా, బిల్లులు సక్రమంగా చూపించపోయినా వారికి చిక్కులు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.

18లక్షల నగదు, రూ.కోటి విలుగల వస్తువులు, మద్యం సీజ్

ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు రూ.17.84లక్షల నగదును సీజ్ చేశారు. 29,148 లీటర్ల మద్యం, 29.35లక్షల విలుగల డ్రగ్స్, రూ.10.38లక్షల విలువగల లోహ పరికరాలు, రూ.31.01లక్షల విలువ గల వివిధ విస్తుసామగ్రి కూడా స్వాధీనం చేసుకున్నారు. అన్నీ కలుపుకుని సుమారు రూ.1,17,32,501 విలువైన వాటిని స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు చెబుతున్నారు. మద్యం విక్రయాలు ఎక్కువగా జరుగుతున్న చోట ప్రత్యేక నిఘా పెడుతున్నారు.

కలెక్టరేట్‌లో ఎన్నికల కంట్రోల్ రూం

జిల్లా స్థాయిలో ఎన్నికల కంట్రోల్ రూంను కలెక్టరేట్‌లో ఏర్పాటు చేశారు. ఫిర్యాదులు స్వీకరణ, సమస్యల పరిష్కార చర్యల నిమిత్తం 24గంటలూ అందుబాటులో ఉంటుంది. ఇక్కడి నుంచే టీవీ, పత్రికలు, సోషల్‌మీడియాల్లో వస్తున్న ప్రకటనలు, వార్తలను అధికారులు భూతద్దంలో చూస్తున్నారు. ప్రతి ప్రకటన లేదా అనుమానిత కథనాలకు రేటు కడుతున్నారు. వాటిని నామినేషన్లు పూర్తయిన తరువాత అభ్యర్థుల ఖాతాల్లో జమచేసే అవకాశం ఉంటుంది. లేదా పార్టీల ఖాతాల్లోనైనా జమ అవుతాయి. దీనికి అనుసంధానంగా మీడియా సెంటర్ కూడా పక్కనే ఏర్పాటు చేశారు.

అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-వీరఘట్టం

ఎన్నికల నియమంలో భాగంగా ఎక్కడ ఎటువంటి ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని పాలకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.చంద్రమౌళి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఎక్కడైనా ఎటువంటి తగదాలు తలెత్తినా తక్షణమే వారిపై కేసులు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎస్ఐ ఎస్.కె ఫక్రుద్దీన్, సిబ్బంది ఉన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి వీరఘట్టం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం 40 మంది గర్భిణులకు వైద్యాధికారి పి.ఉమా మహేశ్వరి వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఎత్తు ,బరువు తదితర వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం గర్భిణులకు నడుకూరు గ్రామ సత్యసాయి ఆలయ నిర్వాహకులు భోజన సదుపాయం కల్పించారు.

ఎన్నికల నిర్వహణలో లోపాలు రావద్దు

(మొదటి పేజీ తరువాయి)

అడుగగా 35 రూట్లు ఉన్నాయని ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి సమాధానం ఇచ్చారు. వాటికి 140 వాహనాలు అవసరం ఉందని తెలిపారు. కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల నుండి ఇవిఎంలు సకాలంలో స్ట్రాంగ్ రూమ్ కు వచ్చేలా చూడాలని, నిరంతర నిఘా కోసం సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, నిరంతరం విద్యుత్ సరఫరా ఉండాలని అన్నారు. వాహనాల పార్కింగ్ కు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని అన్నారు. ఎన్నికల సామగ్రి పంపిణీ సమయంలో వచ్చినవారికి ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్నం భోజనం సదుపాయాలు కల్పించాలని సూచించారు. వీరి వెంట తహశీల్దార్ వరహాలు, సిఐ చంద్రమౌళి, ఎస్ఐ ప్రశాంత్ కుమార్, కమిషనర్ సర్వేశ్వరరావు, ఎంపిడిఒ ప్రసాదరావు తదితరులు ఉన్నారు.

పోలీస్‌స్టేషన్ సందర్శన

సీతంపేట : ఎన్నికల నేపథ్యంలో కలెక్టర్ నిశాంత్ కుమార్, విక్రాంత్ పాటిల్ సీతంపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు వాచ్ టవర్ ను పరిశీలించి అప్రమత్తంగా ఉండాలన్నారు అధికారులకు పలు సూచనలు చేశారు. వారి వెంట సిఐ చంద్రమౌళి, ఎస్ఐ జగదీష్ నాయుడు తదితరులు ఉన్నారు.

ఎన్‌సిఎస్ కార్మికులకు కుచ్చుటోపీ

(మొదటి పేజీ తరువాయి)

కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్మికులు మరణించినా చెల్లించని బకాయిలు

పరిశ్రమలో పని చేసిన 17మంది కార్మికులు మరణించినప్పటికీ ఇప్పటికి వారి కుటుంబాలకు పిఎఫ్, గ్రాడ్యుటీ బకాయిలు చెల్లించలేదని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఎన్‌సిఎల్‌టి అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

ఆస్తులను కాపాడి కార్మికులకు న్యాయం చేయాలి

ఎన్‌సిఎస్ ఆస్తులను కాపాడి కార్మికులకు న్యాయం చేయాలని ఎన్‌సిఎస్ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి సాలా కొండలరావు డిమాండ్ చేశారు. ఆస్తులను కాపాడాల్సిన అధికారులే దొడ్డుదారిన అమ్మివేయడం దుర్మార్గమన్నారు.

మెటీరియల్ బయటకు వెళ్లలేదు

పరిశ్రమలో ఉన్న మెటీరియల్ బయటకు వెళ్లలేదని ఎన్. సిఎల్‌టి నియమించిన ఉద్యోగి సూర్యనారాయణ తెలిపారు. రాజాంలోని పామాయిల్ పరిశ్రమకు చెందిన రోలర్స్ బాగు చేసేందుకు ఎన్‌సిఎస్ పరిశ్రమకు లారీతో తెచ్చారని, రోలర్స్ బాగు చేసేందుకు ఎన్‌సిఎల్‌టికి పర్మిషన్ కోసం లెటర్ పెట్టామని తెలిపారు. అనుమతి వస్తే బాగు చేసి పంపిస్తామని చెప్పారు.

ఎల్‌జి సరికొత్త టివి ఆవిష్కరణ

ప్రజాశక్తి-శ్రీకాకుళం

ప్రముఖ గృహ ఉపకరణాల సంస్థ ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ నూతన ఉత్పత్తి 'ఎల్‌జియుఎన్‌ఇడి83' ని బుధవారం శ్రీకాకుళంలోని నూతన రిలియన్స్ స్టోర్‌లో ఆవిష్కరించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రిలియన్స్ ఎపి, తెలంగాణ రీజనల్ మేనేజర్ అభిషేక్ మాట్లాడుతూ ఈ టివి ఎఐ ఆధారంగా పనిచేస్తూ వినియోగదారుల అభిరుచికి తగ్గట్టుగా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసుకుటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎల్‌జి సంస్థ రీజనల్ హెడ్ కృష్ణాజి, బ్రాంచ్‌మేనేజర్ యుగంధర్, స్టోర్ మేనేజర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరంలో ఎమ్మెల్యే ప్రచారం

ప్రజాశక్తి-సీతానగరం

సీతానగరం దేవర వీధి, మెట్టివీధిలో బుధవారం ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ప్రతి ఇంటికి వెళ్లి వైసిపి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు బి.చిట్టిరాజు, బి.శ్రీరాములు నాయుడు, జెడ్‌పిటిసి ఎం.బాబ్జి, ఎంపిటిసి కిరణ్ గౌరీ, పాల్గొన్నారు.

టోఫెల్ పరీక్ష

పార్వతీపురం రూరల్ : పాఠశాల విద్యార్థులకు విదేశీ భాషలో పరిజ్ఞానం కోసం బుధవారం టోఫెల్ పరీక్ష నిర్వహించారు.మండలంలోని నర్సిపురం హైస్కూల్లో 3, 4, 5 తరగతుల విద్యార్థులకు నిర్వహిస్తున్న టోఫెల్ పరీక్షను డిఇఒ పగడాలమ్మ పర్యవేక్షించారు. పరీక్ష తీరును గమనించి సంతృప్తి వ్యక్తం చేశారు.

నేరాలు ఘోరాలు

ఇద్దరిపై పోక్సో కేసులు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని పుట్టూరు గ్రామానికి చెందిన పెంటకోట ప్రసన్నకుమార్ అనే యువకుడు బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. దీంతో బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు మేరకు బుధవారం పోక్సో కేసు నమోదు చేసి, అదుపులో తీసుకున్నామని రూరల్ ఎస్ఐ దినకర్ తెలిపారు. బాలగడప గ్రామానికి చెందిన జి.సూర్యప్రకాశ్‌ని కులదూషణ చేసినందుకు అదే గ్రామానికి చెందిన ఆరుగురిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి, ఎఎస్‌పి నవీన్ కుమార్ దర్యాప్తు చేస్తారని తెలిపారు.

వంగర : మండలంలోని సంగం గ్రామానికి చెందిన యువకుడు బొడ్రోతు శివకృష్ణపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జనార్దన్ తెలిపారు. అదే గ్రామానికి చెందిన బాలికను ప్రేమించి, శారీరకంగా లోబరుచుకున్నాడు. ఆమె గర్భిణీగా తేలడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చెరకు క్రషర్లు దగ్ధం

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని రేజేరు గ్రామంలో బొమ్మినాయని అప్పలనాయుడు, రాముకు చెందిన చెరుకు క్రసర్స్ పూర్తిగా దగ్ధం అయినట్లు సర్పంచ్ వెంకటనాయుడు తెలిపారు. ఈ క్రషర్లు సుమారు రూ.8లక్షల విలువ ఉంటుందని అన్నారు. ఎండ సమయంలో ఈ ప్రమాదం జరిగిందని ఎలా అయ్యిందో ఇంకా తెలియాల్సి ఉందని చెప్పారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చే సరికి పూర్తిగా కాలి బూడిదయ్యాయని అని అన్నారు.

నల్లబెల్లిలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని నల్లబెల్లి కల్లాల వద్ద మంగళవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో నక్కల పేరునాయుడుకు సంబంధించిన మూడు పాడి గేదెలు ప్రమాదానికి గురయ్యాయి. ఈ ప్రమాదంలో ఒక గేదె మరణించగా రెండు గేదులు పాక్షికంగా అగ్నికి గురయ్యాయి. ఈ అగ్ని ప్రమాదంలో 50 క్వింటాలు ధాన్యం కూడా దగ్ధమయ్యాయి. ఆర్ఐ రామలక్ష్మి, గ్రామ రెవెన్యూ అధికారి తాతారావు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేయగా ఆస్తి నష్టమో సుమారు రెండు లక్షలు వరకు ఉంటుందని అంచనా వేశారు.

842 మద్యం బాటిళ్లు ధ్వంసం

ప్రజాశక్తి-సీతానగరం

స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎఎస్‌పి సునీల్ శరన్ ఆధ్వర్యంలో 842 మద్యం సీసాలను బుధవారం ధ్వంసం చేశారు. ఈ సీసాలు 24 కేసుల్లో పట్టుబడ్డాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా గ్రామాలలో అక్రమంగా మద్యం తరలించినా, బెల్ట్ షాపులు నడిపినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎం.రాజేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన వ(ధ)నం

సీతంపేట ఐటిడిఎలో హెచ్‌ఎన్‌టిసి (హార్టికల్చర్ నర్సరీ కమ్ ట్రైనింగ్ సెంటర్) ద్వారా రైతులకు ఒకప్పుడు మొక్కలు కావాలంటే కడియం నుంచి తెప్పించేవారు. దీనికి రవాణా ఛార్జీలు తడిసి మోపెడు అయ్యేవి. పర్యావసానం.. హెచ్‌ఎన్‌టిసిల సిబ్బందికి జీతాలు సరిగా అందేవి కాదు. నిర్వహణ కూడా భారమయ్యేది. అది ఒకప్పటి మాట. ప్రస్తుతం పరిస్థితి మారింది. ఆదాయ పంట పండుతోంది. సీతంపేట ఐటిడిఎలో ఉద్యానశాఖ శాఖకు హెచ్‌ఎన్‌టిసిలు కల్పతరువుగా మారాయి. రైతులకు అన్ని రకాల మొక్కలు అందుబాటులోకి వచ్చాయి. అధిక దిగుబడినిచ్చే మొక్కలు అందుతున్నాయి. అటు రైతులకు, ఇటు హెచ్‌ఎన్‌టిసికి లాభాల పంట పడుతోంది. ఇంచుమించుగా ఆరేడు నెలల్లోనే ఈ మార్పు వచ్చింది. అందుకు ప్రత్యేక కారణం.. పిహెచ్‌ఒ గణేష్. ఆయన బాధ్యతలు చేపట్టాక.. హెచ్‌ఎన్ టిసిల రూపు రేఖలు పూర్తిగా మారాయి. మొక్కలు కొనుక్కొనే పరిస్థితి పోయి.. ఇక్కడి నుంచే లక్షలాది మొక్కలు పంపిణీ చేసే స్థితికి హెచ్‌ఎన్‌టిసిలు వచ్చాయంటే, ఆయన కృషి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

- **పిహెచ్‌ఒ గణేష్ కృషి ఫలితం**
- **ఆరు నెలల్లో మారిన రూపురేఖలు**
- **ఆదాయం తెచ్చిపెడుతున్న హెచ్‌ఎన్‌టిసి**

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఐటిడిఎకు అనుబంధంగా ఉన్న ఉద్యాన శాఖ ద్వారా తురాయి పువలస, పాతవనుకంవలనలో హెచ్‌ఎన్‌టిసి (హార్టికల్చర్ నర్సరీ కమ్ ట్రైనింగ్ సెంటర్) ఫారాలు నిర్వహిస్తున్నారు. ఈ రెండింటిపై గత ఐటిడిఎ పిఒలు ప్రత్యేక దృష్టిసారించి అధిక ఫలసాయం తెప్పించేవారు. రానురాను ఆదరణ తగ్గుతున్న సమయంలో పిహెచ్‌ఒగా ఎస్‌వి గణేష్ బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి ఫారం తాలూకా రూపురేఖలు మార్చేశారు. ఎకో పార్కు తరహాలో నర్సరీని బంగారు వర్ణాలుగా తీర్చిదిద్దారు. నర్సరీకి వెళ్లగానే ఆహ్లాదకరమైన వాతావరణంతో కనువిందు చేసే పువ్వులు దర్శనమిస్తాయి. కొబ్బరి మొక్కలు వీచే గాలులు గుండెకి తాగితే ఎంతో హాయిగా ఉంటుంది. ఈ ఆరు నెలల్లో మార్పులు చేసి, కొత్త ఆదాయాలు తెచ్చి పెట్టే విధంగా పిహెచ్‌ఒ చేసిన కృషిని ప్రస్తుత పిఒ కల్పనకుమారి గుర్తించి, ఉత్తమ అధికారిగా రిపబ్లిక్ డే సందర్భంగా అవార్డు అందజేశారు. చోడవరంలో ఉన్నప్పుడు కలెక్టర్ చేతుల మీదుగా పలుమార్లు అవార్డులు అందుకున్నారు.


మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

సీతంపేట ఐటిడిఎ పరిధిలోని 20 మండలాల్లో ఉపాధి హామీ ద్వారా ఉద్యాన శాఖ సమన్వయంతో సుమారు 3 వేల ఎకరాలకు కడియం నుంచి గతంలో మొక్కలు తెప్పించేవారు. దానికి రవాణా ఛార్జీలు సుమారు రూ.30 లక్షల వరకు ఖర్చు చేసేవారు. అది ఒకప్పటి మాట. ప్రాజెక్టు హార్టికల్చర్ అధికారిగా ఎస్.వి.గణేష్.. చోడవరం నుంచి గతేడాది ఆగస్టులో ఉద్యోగోన్నతిపై వచ్చారు. అప్పటికే హెచ్‌ఎన్‌టిసి ఫారాలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. 40 మంది సిబ్బంది ఉన్నప్పటికీ సకాలంలో జీతాలు అందక ఇబ్బందులు పడుతుండేవారు. పంపిణీ చేసిన మొక్కల డబ్బులు కూడా సుమారు రూ.36 లక్షల వరకు ఎన్‌ఆర్‌ఇజిఎస్ ద్వారా రాలేదు. దీంతో తదుపరి కార్యాచరణ కూడా ముందుకు సాగని పరిస్థితి నెలకొంది.

ప్రత్యేక ప్రణాళికతో..

ఇక్కడి హెచ్‌ఎన్‌టిసిల పరిస్థితిపై ఓ అవగాహనకు వచ్చిన పిహెచ్‌ఒ.. పక్కా ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు. ముందుగా హార్టికల్చర్ నర్సరీ ట్రైనింగ్ సెంటర్లో పది మంది నైపుణ్య సిబ్బందిని గుర్తించారు. అన్ని వసతులు ఉన్నాయని గుర్తించి, ఇక్కడే మొక్కలు తయారు చేసే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ముందుగా ఉపాధి హామీ ద్వారా రావాల్సిన రూ.36 లక్షలు తెప్పిస్తూ, సిబ్బందికి జీతాలు పెంచుతూ, నెల నెలా సకాలంలో వేతనాలు అందేలా ఉన్నత అధికారుల దృష్టి తీసుకొని వెళ్లి పరిష్కరించారు. దీని ద్వారా ఒక అడుగు ముందుకు వేశారు.

ఇక్కడి నుంచే మొక్కలు పంపిణీ

సీతంపేట ఐటిడిఎ పరిధిలో 20 మండలాల్లో సుమారు 8 వేల మంది రైతులు ఉన్నారు. ఈ రెండు ఫారాల్లో ప్రభుత్వం నిర్ణయించే ధరకు ఏ మొక్క అడిగినా దొరికినట్లుగా పార్కు మాదిరిగా తయారు చేశారు. ఇంతకుముందు ఈ ఫారం వాళ్లే మొక్కలు కొనడానికి కడియం వెళ్లేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. వీటిలో రెండు లక్షలు జీడి, లక్ష టేకు, 15 వేల సీతాఫలాలు, 25 వేలు నిమ్మ, 20 వేల జామి, 10 వేలు కొబ్బరి, 20 వేల సపోటా.. ఇలా 4 లక్షల మొక్కలు తయారు చేశారు. 20 మండలాల్లో 3 వేల ఎకరాల్లో ఉపాధి హామీ ద్వారా మొక్కలు సరఫరా చేయడానికి సిద్ధం చేశారు. అంతేకాకుండా రైతులకు అన్ని మొక్కలు అందుబాటులోకి తీసుకొచ్చారు. ముఖ్యంగా ఏజెన్సీలో గిరిజనులు ఆధారమైన ఆర్థిక వనరులు జీడి, పసుపు, పైనాపిల్. దీనికి సంబంధించి మొక్కలు పిహెచ్‌ఒ గణేష్ ప్రత్యేకంగా నడుం బిగించారు. జీడి మొక్కలు త్వరగా ఇవ్వడానికి ఇప్పటికే ప్రణాళికలు రూపొందించారు. జులైలో వర్షాలు పడేసరికి రెండు లక్షల మొక్కలు ఇవ్వడానికి సిద్ధం చేస్తున్నారు.

ఆదాయ పంట

నర్సరీలో నిధులు ప్రత్యేకంగా ఉండాలని ఉద్దేశంతో పామాయిల్ తోటలు కూడా వేయడానికి పిహెచ్‌ఒ ప్రత్యేక దృష్టిసారించారు. సుమారు ఏడాదికి రూ.50 లక్షలు నుంచి 60 లక్షల వరకు ఆదాయం వచ్చేటట్లు కృషి చేస్తున్నారు. అంతేకాకుండా 30 ఏళ్ల నాటి మొక్కలతో ఫలసాయం రైతులకు తక్కువ వస్తుందనే ఉద్దేశంతో కొత్త రకాలపై దృష్టిపెట్టారు. జీడిమొక్క 20 కిలోల వరకు పంట దిగుబడి వచ్చేలా నాణ్యమైన మొక్కల కొత్త రకాలపై ఆలోచన చేశారు. బాపట్ల జీడి, సంకరజీడి రకాలు 8, 9 రకాలు, వేంగళూరు 4, వృద్ధాచలం జీడి తయారు చేశారు. మామిడి రకాల్లో బంగినపల్లి, సువర్ణ రేఖ, నీశాలు, రాయల్ స్పెషల్... ఇలా 30 రకాలు సిద్ధం చేశారు. సపోటాలో పాల వెరైటీ, క్రికెట్ బాల్ కాలవత్తి, జామిలో హలహలబాద్, సఫేదు, ఆర్కే గ్రీన్, లక్నో ఎల్ 49, తైవాన్, సీతాఫలంలో బాలానగర్, బాలాజీ, తదితర కొత్త రకాలు తయారుచేసి అందుబాటులో తెచ్చారు. ఇలా హెచ్‌ఎన్‌టి కేంద్రానికి అధిక ఆదాయం సమకూర్చారు.


మొక్కలను సిద్ధం చేస్తున్న కార్మికుడు

రూ.2 కోట్ల ఆదాయం వచ్చేలా చర్యలు

సీతంపేట ఐటిడిఎ పరిధిలో ఉన్న రెండు హెచ్‌ఎన్‌టిసిలు 130 ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. 40 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రతి ఏడాది నిర్వహణకు ఖర్చులు తీసి పోగా, రెండు కోట్ల ఆదాయం వచ్చేటట్లు ప్రణాళికలు రూపొందించాం. అందుకనుగుణంగా ఉన్నతాధికారులు, ఐటిడిఎ పిఒ కల్పనకుమారి సహకారంతో ముందుకు వెళ్తున్నాం. ప్రతి మొక్కను గిరిజన రైతులకు ప్రభుత్వం నిర్ణయించే ధరకు అందిస్తాం.

– ఎస్.వి.గణేష్, పిహెచ్‌ఒ, సీతంపేట ఐటిడిఎ

ఇంటింటి ప్రచారంపై సమాచారమివ్వాలి

ప్రజాశక్తి-విజయనగరం

ఇంటింటి ఎన్నికల ప్రచారం, పాంప్లెట్ల పంపిణీ గురించి ముందుగా సంబంధిత పోలీసు స్టేషన్లో సమాచారం ఇస్తే సరిపోతుందని, ప్రత్యేకంగా వీటికోసం అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి స్పష్టం చేశారు. తన ఛాంబర్‌లో బుధవారం నిర్వహించిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ నుంచి తాజాగా వచ్చిన మార్గదర్శకాలను వివరించారు. ఇంటింటి ప్రచారానికి, పాంప్లెట్ల పంపిణీకి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని గతంలో నిబంధన ఉండేదని, రాజకీయ పార్టీల విజ్ఞప్తి మేరకు దీనిని సవరించడం జరిగిందని తెలిపారు. అయితే ఎక్కడ సమావేశాలను, ర్యాలీలను నిర్వహించినా, సంబంధిత ఆర్‌ఒ నుంచి ముందుగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

కొత్తగా ఓటు నమోదు చేసుకోవడానికి మరో నాలుగు రోజులు మాత్రమే అవకాశం ఉందని కలక్టర్ చెప్పారు. ఈనెల 14లోగా దరఖాస్తు చేసుకున్నవారికి మాత్రమే, వచ్చే ఎన్నికల్లో ఓటు వేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఇప్పటివరకు కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసుకున్న సుమారు 2.12 లక్షల మందికి ఓటరు గుర్తింపు కార్డులను పంపించామన్నారు. వీటిలో సుమారు 6వేల కార్డులు వారి చిరునామాలకు చేరకపోవడంతో తిరిగి వచ్చాయని, వాటిని బిఎల్‌ఒల ద్వారా ఆయా ఓటర్లకు అందించడానికి చర్యలు తీసుకున్నామని వివరించారు. ఓటరు జాబితాలో పేరు ఉండి, ఎపిక్ కార్డు లేకపోయినప్పటికీ, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గుర్తింపుకార్డులను చూపించి ఓటుహక్కు వినియోగించుకోవచ్చని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, వివిధ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, ఎఆర్‌ఒలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు రొంగలి పోతన్న, నర్సింహరావు, రెడ్డి శంకర్రావు, సోములు పాల్గొన్నారు.

కోపతాపాలు వీడి కలిసి పనిచేయండి

టిడిపి విశాఖ ఎంపి అభ్యర్థి భరత్

ప్రజాశక్తి-లక్కవరపుకోట

సార్వత్రిక ఎన్నికలు ముగిసే వరకు టిడిపి, జనసేన నాయకులంతా కలిసి గెలుపుకోసం పనిచేయాలని విశాఖ లోక్‌సభ టిడిపి అభ్యర్థి భరత్ పిలుపు నిచ్చారు. బుధవారం స్థానిక ఓ ఫంక్షన్ హాలులో జరిగిన జనసేన పార్టీ నియోజక వర్గ ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథులుగా భరత్‌తో పాటు ఎమ్మెల్యే అభ్యర్థిని కోళ్ల లలిత కుమారి, టిడిపి నాయకులు గొంప కృష్ణ, జనసేన నాయకులు వబ్బిన సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భముగా జనసేన 5 మండలాల నాయకులూ కూటమిలో తమకు గౌరవం దక్కడం లేదని, తమ భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలని కోరారు. భరత్ స్పందిస్తూ ఎన్నికలు పూర్తయ్యేవరకు కోప తాపాలు వదిలి గెలుపునకు కృషి చేయాలన్నారు. గొంపకృష్ణ, కోళ్ల లలిత కుమారి కలిసి పనిచేసే వాతావరణం రావడం గెలుపుకు శుభసూచికంగా ఆయన పేర్కొన్నారు. జనసేన నాయకులకు, కార్యకర్తలకు స్థానిక సంస్థల్లో టిడిపితో కలిసి అవకాశం కల్పిస్తామనిగొంపకృష్ణ, కోళ్ల లలిత కుమారి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన మండల పార్టీ అధ్యక్షులు షేక్ ఫిరోజ్ తన పుట్టిన రోజు సందర్భంగా ఇచ్చిన రంజాన్ విందులో అందరూ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్‌పి అభ్యర్థి భరత్

సూపర్ సిక్స్ హామీలతో ప్రజలకు మేలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

టిడిపి ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలతో ప్రజలకు ఎంతో మేలు కలగనుందని టిడిపి అభ్యర్థి పూసపాటిరేగ అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. బుధవారం 48వ డివిజన్ శ్రీనగర్ కాలనీ, ఆర్‌ఎంఎస్ కాలనీ, జగన్నాథ నగర్‌కాలనీ, సాయి కోలనీ తదితర ప్రాంతాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రకటిం చిన సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరిం చారు, రాష్ట్రం అభివద్ధి చెందాలంటే టిడిపిని గెలిపించాలని కోరారు. వైసిపి అరాచకాల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవలసిన ఆవశ్యకత ఉందని అన్నారు. యువత కు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక భవిష్యత్తుపై నిరుత్సాహంతో డ్రగ్స్ కు బానిసలవుతున్నారని అన్నారు. ఎప్పుడు లేని విధంగా విజయనగరంలో డ్రగ్స్ కు విచ్చలవిడిగా దొరుకుతున్నాయని, దానివలన యువత భవిష్యత్తును కోల్పోతున్నారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, రాష్ట్ర బీసీ నాయకులు వేచలపు శ్రీనివాసరావు. పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, విజయనగరం మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు కార్యదర్శి గంటా పోలినాయుడు, అవనాపు విజయ్ , పిల్లా విజయ్ కుమార్, గాడు అప్పారావు ఈ నసేన, బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి చేయడం రౌడీరాజ్యమా?

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరాన్ని అభివృద్ధి చేయడం రౌడీ రాజ్యమా? అంటూ డిప్యూటీ స్పీకర్, విజయనగరం వైసిపి అభ్యర్థి కోలగట్ల వీరభద్ర స్వామి టిడిపి నాయకులను ప్రశ్నించారు. గాజులరేగలో ఎన్నికల ప్రచారంలో బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూసపాటి అశోక్ గజపతిరాజు ఎన్నికల ముందు బయటకు వచ్చి రౌడీ రాజ్యమంటూ ఆరోపణలు చేయడం సరికాదన్నారు. వార్డుల్లో రోడ్లు, కాలువకు,తాగునీరు ఇబ్బంది లేకుండా చేయడం రౌడీ రాజ్యామా అనిప్రశ్నించారు. నియోజకవర్గంలో చేసింది ఏమీ చెప్పుకోలేక ఇటువంటి చౌకబారు ఆరోపణలు చేయడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. ప్రజలు వాస్తవాలు తెలుసుకొని ఓట్లు వెయ్యాలని కోరారు. ప్రచారంలో మేయర్ విజయలక్ష్మి, కార్పొరేటర్ తవిటిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో యువతే కీలకం

ప్రజాశక్తి -విజయనగరం కోట

ఎన్నికల్లో యువత పాత కీలకమని టిడిపి మండల కార్యదర్శి గంటా పోలినాయుడు అన్నారు. బుధవారం దుప్పాడలో యువతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 'కలలకు రెక్కలు', సోషల్ మీడియా అంశాలపై చర్చించి ప్రస్తుత ఎన్నికలలో యువత కీలకపాత్ర పోషించాలని తెలిపారు. కార్యక్రమంలో నడుపూరు రాంబాబు, దుప్పాడ రామునాయుడు, యువత నాయకులు మజ్జి పైడిరాజు, గంగిరెడ్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలన

టిడిపి అభ్యర్థ అదితి విజయలక్ష్మి వార్డు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్పొరేటర్ అభ్యర్థులు, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలతో సమావేశమై ఓటర్ల జాబితాను పరిశీలించారు. వెంటనే కుటుంబ సాధికార సారధులను నియమించి ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వెరిఫికేషన్ చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, రాజేష్ బాబు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల సమరంలో రాజకీయ పార్టీల ప్రచారాలు వేడెక్కాయి. నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కాకముందే అభ్యర్థులంతా ఓటర్లను కలుస్తూ అభ్యర్థిస్తున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. నామినేషన్ దాఖలు చేయకుండానే ఒక విడత ప్రచారం ముగించేలా ప్రణాళికలు వేసుకున్నారు. అభ్యర్థులతో పాటు కుటుంబగణం మొత్తంగా ప్రచారంలో పాల్గొంటున్నారు. గెలుపే ధ్యేయంగా ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు



ఓట్ల వేట..

వెతుకులాట

నామినేషన్లకు ముందుగానే ముమ్మర ప్రచారం

అభ్యర్థులతోపాటు కుటుంబ సభ్యులూ..



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈ సారి రాజకీయ పార్టీలు ముందుగానే అభ్యర్థులను ప్రకటించేశాయి. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 11 నియోజకవర్గాలకు సంబంధించి టిడిపి, వైసిపి, కాంగ్రెస్ తన అభ్యర్థులను ప్రకటించాయి. దీంతో అభ్యర్థులు ఆయా నియోజకవర్గాల్లో ప్రచారాలు చేస్తున్నారు. నామినేషన్లు వేసేందుకు ఇంకా వారం రోజుల సమయం ఉంది. ఆ లోపుగానే ఓటర్లను కలుసుకుని ఓట్లు అభ్యర్థిస్తున్నారు. నామినేషన్ల తంతు పూర్తవగానే ప్రచార వేడి మరింత వేగం పుంజుకోనుంది. ఏ ఒక్క ఓటరునూ వదలకుండా.. ఇల్లు, పొలం అన్న తేడా లేకుండా ఎక్కడ జనం ఉంటే అక్కడికి నేతలు వాలిపోతున్నారు. తమను గెలిపించి ఆదరించాలంటూ విజ్ఞప్తులు చేస్తున్నారు. పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోతో పాటు, స్థానికంగా అభివృద్ధి చేస్తామని చెబుతూ అధికార వైసిపి హామీ ఇస్తుంటే, తాము అధికారంలోకి వస్తే ఏమి చేస్తామో టిడిపి అభ్యర్థి కూడా హామీలు గుప్పిస్తున్నారు.

ఓట్ల కోసం వ్యూహాలు

అభ్యర్థులు ఓట్ల కోసం వ్యూహ రచనలు చేస్తున్నారు. గత ఆరు నెలలుగా ఓటర్లను మననం చేసుకునే పనిలో పడ్డారు. విజయనగరంలో అధికార పార్టీ ఎమ్మెల్యే కోలగట్ల ఏడాది క్రితం నుంచే ఎన్నికల పనులు ప్రారంభించారు. అందులో భాగంగానే ప్రభుత్వ వ్యతిరేకతతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాలు, పెన్షన్ దార్లు, మహిళలు, యువజనులతో వేర్వేరుగా ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. యువజన విభాగం ఆధ్వర్యాన భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రతి వార్డులోనూ సమావేశాలు పెట్టారు. ప్రభుత్వ వ్యతిరేక వర్గాలను కలుపుకొని పోవడం, ఉద్యోగులతో ఫోన్లులో నేరుగా మాట్లాడటం, వార్డు మీటింగ్‌లు, వీధి మీటింగ్ లు పెట్టడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఇదే తనకు ఆఖరు ఎన్నికలని, చివరి అవకాశం కల్పించాలని కోలగట్ల కోరుతున్నారు. టిడిపి అభ్యర్థి నాలుగు నెలలుగా ఇంటింటి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం వార్డుల్లో ముఖ్య నాయకులతో సమావేశం అవుతున్నారు. ఆ ప్రాంతంలో నిర్వహించే ప్రచారంలో ఎలాంటి జాగ్రత్తలుతీసుకోవాలి..? ఎవరితో మాట్లాడాలి.? మహిళా ఓటర్లను ఎలా ప్రసన్నం చేసుకోవాలని అనే అంశాలపై చర్చిస్తున్నారు. తమ పార్టీ మద్దతుదారుడు అయితే ఈ సారి సహకరించమని, ప్రత్యర్థి పార్టీ ఓటరయితే తాము అధికారంలో ఉండగా మీ కుటుంబానికి ఇంత మేలు చేశామని చెబుతున్నారు.

టిడిపి అభ్యర్థులు తాము అధికారంలోకి వస్తే మీకు అండగా ఉంటామని హామీ ఇస్తున్నారు. ముఖ్యంగా సూపర్-6 పథకాల ద్వారా కలిగే ప్రయోజనాలను ఓటర్లకు వివరిస్తూ ఓటు అభ్యర్థిస్తున్నారు. అధికారంలోకి వస్తే వృద్ధులకు రూ.4వేలు, వికలాంగులకు రూ.6వేలు పింఛను ఇస్తామని చెబుతున్నారు. ఉచితగ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం తదితర వాగ్దానాల గురించి తెలియజేసి ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

అనుకూల, ప్రతికూల ఓట్లపై లెక్కలు

గ్రామాలం, వార్డుల వారీగా అభ్యర్థులు ఇప్పటి నుంచే అనుకూల, ప్రతికూల ఓటర్లను గుర్తించే పనిలో పడ్డారు. అనుకూల ఓటర్ల కంటే ప్రత్యర్థికి వెళ్లే ఓట్లను తమకు అనుకూలంగా తిప్పుకోవడం కోసం అన్ని విధాలా ప్రయత్నం చేస్తున్నారు. ఒక కుటుంబాన్ని తమ వైపునకు తెచ్చుకుంటే ఆ ఇంట్లోని నాలుగు ఓట్లు తమకు వస్తాయన్న భావనతో వారిని బుజ్జగిస్తూ వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారు. నామినేషన్లు వేసిన అనంతరం ఈ ప్రచార వేడి మరింత పెరగనుంది.

నగరంలో ప్రచారం తీరిది

విజయనగరంలో వైసిపి ఎమ్మెల్యే కోలగట్ల ప్రతి డివిజన్‌లోనూ 50 ఇళ్లకు ఒక ఇన్‌ఛార్జిని నియమించారు. బూత్ కమిటీలు, వార్డు కమిటీలు, సచివాలయం కన్వీనర్లను పెట్టి ఓటర్లు వద్దకు వెళ్లే ప్రయత్నం చేపట్టారు. ఓటర్లు అడ్రస్‌ల కోసం జల్లెడ పడుతున్నారు. ఒక వేళ అడ్రస్ దొరక్కపోతే ఒక్క ఓటే అయినా వారి గురించి ఆరా తీస్తూ ఎలాగోలా పట్టు కుంటు న్నారు.

కూటమి అభ్యర్థి అదితి గజపతిరాజు వాలంటీర్లు మాదిరిగా యువకులను 100 ఇళ్లకు ఒకరిని నియమించి ఓటర్లకు దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారు. అదితి గజపతి ఇంటింటి ప్రచారం చేపడుతుండగా, జయహో బిసి, మహిళా మేలుకో కార్యక్రమాల పేరిట మిగతా నాయకులు ప్రచారం చేపడు తున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి సుంకరి సతీష్ కుమార్ వైసిపి, టిడిపి వైఫల్యాలను ప్రజలకు వివరిస్తున్నారు. ఈరెండు పార్టీలూ మోడీ కి దాసోహమవ్వడం, ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వకపోవడం,విభజన చట్టంలో హామీలు అమలు చేయపోవడం వంటి అంశాలను ప్రజలకు వివరిస్తున్నారు.

పాత ప్రత్యర్థులే

మూడోసారి తలపడుతున్న కళావతి, జయకృష్ణ


కళావతి - వైసిపి


జయకృష్ణ-జనసేన

ప్రజాశక్తి-పాలకొండ

నియోజకవర్గంలో పాత ప్రత్యర్థుల మధ్యే ఈసారి కూడా పోటీ ఉండనుంది. వైసిపి తరపున సిట్టింగ్ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బరిలో ఉండగా, ఎన్‌డిఎ కూటమి అభ్యర్థిగా జనసేన తరపున నిమ్మక జయకృష్ణ బరిలో నిలిచారు. 2014, 2019 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన జయకృష్ణపై వైసిపి అభ్యర్థి గా విశ్వాసరాయి కళావతి పోటీ చేసి గెలుపొందారు. 2014 లో 1600 ఓట్ల తేడాతో కళావతి గెలుపొందగా, 2019 ఎన్నికల్లో 19000 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. మూడోసారి కూడా వైసిపి నుంచి కళావతి పోటీలో ఉండగా, కూటమి తరపున సీటు జనసేనకు కేటాయించారు. చివరిలో జయకృష్ణ పార్టీలో పోటీని తట్టుకుని జనసేన తరపున సీటు సంపాదించుకున్నారు. ఈసారి కూడా వీరిద్దరి మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. ఇరువురు కూడా వీరఘట్టం మండలానికి చెందిన నాయకులే కావడం గమనార్హం. కళావతి వండువ గ్రామానికి చెందిన వారు కాగా, జయకృష్ణ అదే మండలంలో ఎం.రాజపురం గ్రామానికి చెందినవారు.

కలయికపై లేదు క్లారిటీ

- **ఊళ్లోకి వచ్చినా ఇంటికి వెళ్లలేని స్థితిలో గుమ్మడి**
- **తామేం చేయాలో పార్టీనే చెప్పాలన్న 'పెంట'**
- **టిడిపి శ్రేణుల్లో ఇంకా అయోమయం**


తిరుపతిలో నివాసంలో సమావేశమైన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-మక్కువ

మండలంలో నెలకొన్న టిడిపి గ్రూపుల వ్యవహారం ఇంకా ఓ కొలిక్కి వచ్చే పరిస్థితి కనిపించలేదు. ఈ నెల 8న విశాఖ పట్నంలో జరిగిన చర్చల్లో టిడిపి అగ్ర నేతలు.. ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణి, పెంట తిరుపతిరావు మధ్య విభేదాలను సద్దుమణిగింపజేసే ప్రయత్నం చేశారు. అందులో భాగంగా బుధవారం పెంట తిరుపతిరావు ఇంటి వద్ద సంధ్యారాణితో కలిసి సమన్వయ సమావేశం ఏర్పాటు చేసుకోవాలన్న సూచన కూడా చేసినట్లు తెలిసింది. అయితే అధిష్టానం ఆదేశాల మేరకు పెంట తిరుపతిరావు తన గ్రూపుతో బుధవారం ఎ.వెంకన్నపేటలో ఉన్న తన నివాసం వద్ద సంధ్యారాణి రాక కోసం ఎదురు చూడ సాగారు. ఎ.వెంకంపేట గ్రామంలోని టిడిపి మండల అధ్యక్షులు గుల్ల వేణుగోపాల్ నాయుడు నివాసానికి సంధ్యారాణి వెళ్లారు. అక్కడ పరామర్శ కార్యక్రమం ముగించుకుని ఆ గ్రూపు కలిసితో తిరుపతిరావు వద్దకు వెళ్లాలని విషయం చర్చించినట్లు తెలిసింది. అయితే అందులో ముగ్గురు వ్యక్తులు తిరుపతిరావుతో కలవొద్దంటూ ఆమెకు మోకాలడ్డడంతో అక్కడి నుంచి వెనుతిరిగారు.

మేమేం చేయాలో పార్టీ చెప్పాలి

టిడిపి అధిష్టానం ఆదేశాల మేరకు బుధవారం ఉమ్మడి సమావేశం కోసం సాయంత్రం ఐదున్నర గంటల వరకు తన నివాసం వద్ద పార్టీ శ్రేణులతో కలిసి వేచి చూసినా గుమ్మడి సంధ్యారాణి రాలేదని పెంట తిరుపతిరావు విలేకరులకు తెలిపారు. ఘన స్వాగతం పలికేందుకు తామంతా ఎదురుచూసినప్పటికీ అభ్యర్థి స్థానంలో ఉన్న ఆమె తమకు కనీస సమాచారం ఇవ్వకపోవడం, పాత ధోరణి కొనసాగిస్తుండడంపై పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. దీనిపై తామంతా ఏమి చేయాలని దాన్ని పార్టీ నిర్ణయించాలని తెలిపారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ ప్రేమ్‌కుమార్

డిఇఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి- గజపతినగరం

మండలంలోని పలు పాఠశాలలను జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్ కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఎంఆర్‌సి భవనం పక్కన గల ప్రాథమిక పాఠశాలను సందర్శించి తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలపై ప్రశ్నలు సంధించారు. అనంతరం మరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, పీఎస్ఆర్ పురంలో గల ప్రాథమిక ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ పాఠశాలల్లో రికార్డులను, రిజిస్టర్‌లను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బాయ్స్ హై స్కూల్‌లో జరుగుతున్న టోఫెల్ పరీక్ష విధానాన్ని పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు అంశాలపై దిశ నిర్దేశం చేశారు. పిఎస్ఆర్‌పురంలో గల ఆర్వో ప్లాంట్‌ను పరిశీలించారు. తనిఖీల్లో ఆయన వెంట ఎంఇఒలు విమలమ్మ, సాయి చక్రధర్ పాల్గొన్నారు.

కూలీలు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - దత్తి రాజేరు

ఎండల తీవ్రత దృష్ట్యా ఉపాధి కూలీలు జాగ్రత్తలు పాటించాలని పిహెచ్‌సి వైద్యాధికారి ఆనంద్ తెలిపారు. సరయ్యవలస గ్రామంలో బుధవారం ఉపాధి పనులు పరిశీలించి అక్కడ ప్రజలకు వడదెబ్బపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత దృష్ట్యా మజ్జిగ, కొబ్బరి నీళ్లు, నిమ్మకాయ నీళ్లు, తీసుకొని వడదెబ్బకు గురికాకుండా ఉండాలన్నారు. అనంతరం ఓఆర్ఎస్ పాకెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పి. చంద్రకుమారి, సిహెచ్ఒ చిన్ని కృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్, ఆశాకార్యకర్త తదితరులు పాల్గొన్నారు.

మొన్న టిడిపి..నిన్న వైసిపి

కలగాడలో విచిత్రంగా చేరికలు

ప్రజాశక్తి - జామి

మొన్న టిడిపి కండువా వేసుకున్నావారే.. నిన్న వైసిపి కండువా వేసుకున్నారు. ఈ విచిత్ర పరిణామం జామి మండలం కలగాడలో చోటు చేసుకుంది. కొత్తవలస వైసిపి క్యాంపు కార్యాలయంలో కలగడ గ్రామానికి చెందిన దొండపర్తి అక్కులు, బోని సత్తిబాబు, చెవ్వేటి రాధాకృష్ణ, బండారు శ్రీరాములు, దొండపర్తి అప్పారావు, సహా 40 కుటుంబాలు స్థానిక ఎమ్మెల్యే సమక్షంలో బుధవారం చేరాయి. అయితే కొద్ది రోజులు క్రితం టిడిపి నాయకులు మభ్య పెట్టి కండువాలు వేసి టిడిపిలో చేరినట్టు ప్రకటించుకున్నారని వైసిపి నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే టిడిపి చేరికలు వారు తిరస్కరించి అందరు కలసి ఎమ్మెల్యే కడుబండితోనే ఉంటామని జగనన్నని ముఖ్యమంత్రి చేసుకుంటామని ప్రకటించి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీ కండువాలు వేసుకుని శాశ్వతంగా పార్టీలో ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రంలో వైసిపి మండల కన్వీనర్ రవికుమార్ పాల్గొన్నారు.

రూ.1.83 లక్షలు పట్టివేత

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద బుధవారం ఎస్ఐ ఈ. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. ఈ దాడుల్లో ద్విచక్ర వాహనంతో వస్తున్న వ్యక్తి వద్ద నుంచి రూ.1.83 లక్షలు బ్యాగులో ఉన్నట్లు గుర్తించారు. నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదుకు ఎటువంటి జమ, లెక్కలు రసీదులు లేకపోవడంతో జెడ్‌పి సిఇఒకు సమాచారం అందించారు. స్థానిక పెట్రోల్ బంక్ యజమానిది అని చెప్పారని పోలీసులు తెలిపారు. అనంతరం కార్లు, బస్సులు, ఆటోలు ఇతర వాహనాలు తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు.

రామభద్రపురం: అక్రమంగా మద్యం, నగదు రవాణాను నిరోధించడానికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని బొబ్బిలి రూరల్ సిఐ తిరుమలరావు తెలిపారు. మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద బుధవారం ఎస్ఐ జ్ఞాన ప్రసాద్‌తో కలిసి వాహనాలు తనిఖీ చేశారు. ముఖ్యంగా ఒడిషా ప్రాంతం నుంచి నిషేధిత వస్తు రవాణాకు అడ్డుకట్టవేయాలని తెలిపారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనికీచేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఒడిషా ముఖ ద్వారంగా ఉన్న రామభద్రపురం చెక్‌పోస్టు వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు

శృంగవరపు కోట: మండలంలోని పోతనపల్లి జంక్షన్ వద్ద ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ విస్తృత తనిఖీలు చేపట్టింది. బుధవారం సాయంత్రం ఈ బృందం ఈ రహదారిలో వెళ్తున్న కారులు, వ్యాన్లు ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశాయి. ఈ సందర్భంగా స్క్వాడ్ అధికారులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అధికంగా డబ్బు, మద్యం, చీరలు వంటివి తరలుతాయని వీటిని అరికట్టేందుకు తనిఖీలు చేపట్టామని తెలిపారు.

ఎన్నికల కోడ్ అమలుకు 3 బృందాలు

రామభద్రపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయడానికి 3 బృందాలను ఏర్పాటు చేశామని ఎంపిడిఒ ఈశ్వరమ్మ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఫ్లయింగ్, సర్వేలెన్స్, వీడియో వ్యూ, స్టేటిస్టికల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అనే బృందాలను ఏర్పాటు చేసి మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలుకు పక్కాగా ప్రణాళికలు చేస్తున్నామని తెలిపారు. పంచాయతీల్లో సభలు, సమావేశాలు ఏర్పాటు చేయడానికి అనుమతులు తీసుకోవాలని సూచించారు. బ్యానర్లు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేయకుండా గ్రామ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలన్నారు.



ద్విచక్ర వాహనంలోని నగదును పరిశీలిస్తున్న ఎస్ఐ

గొంప సమక్షంలోనే సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి- వేపాడ

అధికారంలోకి రాగానే యువ నాయకులు గొంప కృష్ణ సమక్షంలోనే సమస్యలను పరిష్కరిస్తామని కోళ్ల లలితకుమారి ఎంపి భరత్, లోకేష్ సమక్షంలో అంగీకరించారని మండల నాయకులు గొంప వెంకటరావు తెలిపారు. ఈ మేరకు ఆయన స్వగృహంలో బుధవారం మండల స్థాయి కార్యకర్తలతో గొంప వెంకటరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌కోటలో జరగనున్న టిడిపి సమావేశానికి మీరంతా ఒకే చెబితేనే వెళదామని లేకపోతే లేదని వెంకటరావు కార్యకర్తలను కోరగా వారంతా అధిష్టానం ఆదేశానుసారం తప్పనిసరిగా సమావేశానికి వెళ్లాలని నిర్ణయించినట్లు వెంకటరావు తెలిపారు. నా స్థానంలో ఎవరైనా బాధ్యత వహిస్తే తాను తప్పుకుంటానని తన ఉద్యోగంలో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని వెంకటరావు స్పష్టం చేశారు. తనకు పార్టీ అంటే ప్రాణమని అందరం కలిసి కట్టుగా పోరాటం చేస్తే తప్ప ఈ అరాచక వైసిపిని మట్టి కరిపించలేమని చెప్పారు. అయితే టిడిపి అభ్యర్థి కోళ్ల లలితకుమారి కూడా కార్యకర్తలను కలుపుకుంటూ పోవాలన్నారు. ప్రత్యేకంగా ప్రజాశక్తి విలేకరిపై గతంలో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారని గొంప వెంకటరావు, కృష్ణ చెప్పిన వార్తలనే రాస్తున్నాడని ఆయనపై వారి యాజమాన్యానికి ఆమె ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో ఎస్‌కోట మహిళ కమిటీ సభ్యులు గుమ్మడి భారతి, పార్లమెంటరీ సమన్వయకర్త జనపరెడ్డి ఈశ్వరరావు, మండల ఐటిడిపి అధ్యక్షులు సేనాపతి గణేష్, మండల రైతు సంఘం ఉపాధ్యక్షుడు సిరికి రమణ, సీనియర్ టిడిపి నాయకులు మాజీ సర్పంచ్లు గొర్లె నాగరాజు, మంచినా అప్పలసూరి, జి రమణ, ఎన్ కామేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గొంప వెంకటరావు

కుక్కల స్వైర విహారం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ ఎదురుగా శ్రీనివాస కోలనీలో నివాసముంటున్న కండక్టరు జి. శ్రీనివాసరావును బుధవారం కుక్క కరిచింది. గత నెల 18న ఇదే వీధిలో ఇద్దరు చిన్నారులను కుక్క కరిచింది. కాంప్లెక్స్ బయట మరో ఇద్దరు బాటసారులను, రెండు కుక్కలను కూడా పిచ్చి కుక్క కరిచింది. దాడి చేస్తున్న కుక్కలకు రేబీస్ వ్యాధి సంక్రమించి ఉండవచ్చునని లేదా మండుటెండల కారణంగా కుక్కలు విచిత్రమైన అవస్థకు గురియై, అకస్మాత్తుగా కనిపించిన వారిపై దాడిచేసి కరుస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈ పరిసరాలలో ఉండేవారందరూ అప్రమత్తంగా ఉండాలని అందరికీ విజ్ఞప్తి చేస్తున్నారు. పక్షం రోజుల్లో రెండవసారి ఇటువంటి సంఘటనలు పునరావృతం అయినప్పటికీ, అన్ని దినపత్రికల్లో కుక్క కాటుకు సంబంధించిన వార్తలు ప్రచురితమవుతున్నా, పంచాయితీ అధికారులు ఎటువంటి చర్యలూ చేపట్టడములేదని, కార్యనిర్వహణాధికారి మొద్దు నిద్రలో ఉన్నట్లున్నారని మండిపడుతున్నారు. ఇప్పటికైనా కుక్కల బెడద తగ్గించే చర్యలు చేపట్టాలని మానవ హక్కుల న్యాయవాది బొబ్బిలి రామకృష్ణ బుధవారం పంచాయితీ అధికారులను కోరారు.

రమేష్ వర్మకు పిహెచ్‌డి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఇసిఇ విభాగం స్కాలర్ దండు రమేష్ వర్మకు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి బుధవారం పిహెచ్‌డి ప్రదానం చేశారు. వర్మ చేసిన డిజైన్ ఆఫ్ టెక్స్టైల్ యాంటీనాస్ ఫర్ వైర్ లెస్ బాడి ఏరియా నెట్ వర్క్స్ అండ్ బయోమెడికల్ అప్లికేషన్స్ అనే పరిశోధన అంశానికిగాను ఈ అవార్డు లభించింది. డీన్ ప్రొఫెసర్ మురళీ పర్యవేక్షణలో ఈ పరిశోధన జరిగింది. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, పలువురు అధ్యాపకులు ఆయనను అభినందించారు.

పలు గ్రామాల్లో జనసేన ప్రచారం

ప్రజాశక్తి- డెంకాడ

వైసిపి పాలనలో పేదవాడు మరింత పేదవాడయ్యాడని జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి అన్నారు. జన విజయ యాత్రలో భాగంగా మండలంలోని నాతవలస, సింగవరం పంచాయతీలలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి పని చేస్తున్న మహిళల దగ్గరికి వెళ్లి ముచ్చటించారు. అనంతరం టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజుతో కలిసి గడప గడపకూ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డికి పబ్లిసిటీ పిచ్చెక్కువని అందుకే అన్ని చోట్లా ఆయన స్టిక్కర్లు పెట్టుకుని పాలిస్తున్నాడని విమర్శించారు. వైసిపి పాలనలో పంచాయతీలు అభివృద్ధి చెందలేదన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బడుకొండ అప్పలనాయుడు అభివృద్ధి ఏమైనా చేశాడా అని మహిళలని ప్రశ్నించారు? అభివృద్ధి చేయకపోగా చెరువులు, భూములు, కొండలను కబ్జాలు చేసి ఉన్నది మొత్తం దోచుకు తింటు న్నాడని ఆరోపించారు. తనకు ఒకసారి అవకాశమిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మహంతి చిన్నంనా యుడు, కంది చంద్రశేఖర రావు, పతివాడ అప్పల నారాయణ, పల్లె భాస్కర్‌రావు, కలిదిండి పాణిరాజు, పతివాడ శివరామ విద్య సాగర్ నాయుడు, కాగితాల సత్యనారాయణ రెడ్డి, జనసేన ఉత్తరాంధ్ర మహిళా రీజినల్ కోఆర్డినేటర్ తుమ్మి లక్ష్మి, చింతపల్లి రామ్మూర్తి, మహంతి నరసింహనాయుడు, కంది సూర్యనారాయణ, పైలా శంకర్, శ్రీనివాస్, రామ్, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం చేస్తున్న లోకం మాధవి

ప్రభుత్వ కళాశాలల్లోనే చేరండి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పదో తరగతి ఉత్తీర్ణులైన బాలికలు ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గల హైస్కూల్ ప్లస్ ఫర్ గర్ల్స్(బాలికల జూనియర్ కళాశాల)లో ఇంటర్మీడియట్ విద్య కోసం చేరాలని అక్కడి అధ్యాపకులు బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు ఎస్‌విఎస్ఎన్ మూర్తి, టి.రాజేష్, ఎ. సురేంద్రనాద్, కె.జయలక్ష్మి, ఎల్.రహీమ్ షేక్ లాల్ తదితరులు మాట్లాడుతూ మన మండలంలో గల ఏకైక ప్రభుత్వ బాలికలు జూనియర్ కళాశాల ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వమే నెలకొల్పిందని ఇంటర్ ఎంపిసి, బైపిసి, సిఇసి గ్రూపులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. పదోతరగతి ఉత్తీర్ణులైన బాలికలందరూ కళాశాలలో చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న అధ్యాపకులు

శ్రీరామనవమికి గోటితో ఒలిచిన తలంబ్రాలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రామతీర్థం రామస్వామి దేవస్థానంలో జరగనున్న శ్రీరామ నవమి వేడుకలకు గోటితో ఒలిచిన తలంబ్రాలు సిద్ధమయ్యాయి. ఈ నెల 17న శ్రీరామనవమి లోక కళ్యాణార్థం నిర్వహించే కల్యాణోత్సవం సందర్భంగా శ్రీరామతీర్థం సేవా సంఘం వారు గోటితో ఒలిచిన కోటి తలంబ్రాలను సిద్ధం చేశారు. 2017 సంవత్సరం నుండి ఏటా రామతీర్థం దేవాలయంలో జరిగే కళ్యాణోత్సవంలో వినియోగిస్తున్నారని సంఘ ప్రధాన కార్యదర్శి సుదర్శనం విజయకుమార్ తెలిపారు. ఈ సంవత్సరం కూడా ఈ సంఘం వారు భక్తిశ్రద్ధలతో, రసాయనాలు వినియోగించ కుండా శాస్త్రీయ పద్ధతిలో సేద్యం చేసిన వరికంకులను కోసి ధాన్యాన్ని సిద్ధం చేశారు. ఆ ధాన్యాన్ని సంఘం ప్రతినిధులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే కాకుండా తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన రామభక్తులకు పంపించారు. ఆ ధాన్యాన్ని భక్తులు భీష్మ ఏకాదశి నుండి శ్రీ రామనామం జపిస్తూ గోటితో ఒలుస్తూ అవి తలంబ్రాలుగా రూపాంతరం చెందిస్తున్నారు. ఈ గోటితో ఒలిచిన తలంబ్రాలను, రామనా మంతో అలంకరణ చేయబడిన కొబ్బరి బొండా లను, కంత (మధుర పదార్థము)ను రామతీర్థం లోని రఘు వంశ సంజాతునికి 108 కలశాలతో సుమారు 500 మంది భక్తులు ఈనెల 15వ తేదీన పురవీధుల్లో మేళతాళాలతో, భజనలతో, కోలాటాలతో కోలాహలంగా ఊరేగింపుగా తీసుకుని వచ్చి దేవస్థానం అధికారులు, అర్చకస్వాముల సమక్షంలో సమర్పిస్తామని తెలియజేశారు. ఈ తలంబ్రాలనే సీతారాముల కళ్యాణోత్సవంలో అర్చకులు వినియోగిస్తారని తెలిపారు.



గోటితో తలంబ్రాలను ఒలుస్తున్న సభ్యులు

ప్రజాశక్తి
గురువారం 11 ఏప్రిల్ 2024

పేదల ఇంటికే సంక్షేమ పథకాలు

వైసిపి మండల సమావేశంలో డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు

వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మళ్ళీ సిఎం అయితేనే పేదల ఇంటికి సంక్షేమ పథకాలు అందుతాయని డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. టిడిపి గెలిస్తే పథకాలు అందవని అఆన్నరు. బుధవారం మండలం లోని గంగన్నదొరవలస సమీపంలోని తోటలో పార్టీ మండల అధ్యక్షుడు సువ్వాడ భరత్ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన మండల సమావేశంలో రాజన్నదొర మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని మళ్ళీ అధికారంలోకి తేవాలని కోరారు. టిడిటి అధికారంలోకి వస్తే పేదలంతా సంక్షేమ పథకాలను కొనుక్కోవాల్సి వస్తుందని చెప్పారు. గతంలో టిడిపి ప్రభుత్వం హయాంలో జన్మభూమి కమిటీలకు ముడుపులు చెల్లిస్తే గాని సంక్షేమ పథకాలు అందే పరిస్థితి లేదన్నారు. టిడిపి కార్యకర్తలు, అనుచరులకే సంక్షేమ పథకాలు అందాయన్నారు. ఇటీవల పింఛనును లబ్దిదారులకు ఇంటికి వెళ్లి పంపిణీ చేయకుండా టిడిపి, జనసేన పార్టీలు కుట్ర చేశాయని ఆరోపించారు. టిడిపి, జనసేన, బిజెపి ల కూటమిని నమ్మితే నట్టేట మునిగిపోతారని అన్నారు. తన నియోజకవర్గంలో 16 వందల కోట్ల సంక్షేమ అభివృద్ధి పథకాలను అమలు చేసినట్లు తెలిపారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో రోడ్లు వంతెనల నిర్మాణం చేపట్టామని చెప్పారు.

కులం పేరుతో రాజకీయం చేస్తే ఇసికి ఫిర్యాదు

టిడిపి అభ్యర్థి సంధ్యారాణి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎస్‌టిల వద్దకు వెళ్ళి తాను ఎస్‌టినని, బిసిల వద్దకు వెళ్లి తాను బిసి నని చెప్పుకుంటున్నారని రాజన్నదొర ఆరోపించారు. ఆధారాలు లభిస్తే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తానని చెప్పారు.

అందరికీ అందుబాటులో ఉంటా.. తనూజారాణి

మాజీ ఎంపీ కొత్తపల్లి గీతలా తాను హైదరాబాద్ లో ఉండనని, అందరికీ అందుబాటులో ఉంటానని అరకు ఎంపి అభ్యర్థి డాక్టర్ తనూజా రాణి అన్నారు. తనకు గిరిజన సమస్యలపై అవగాహన వుందని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు దండి శ్రీనివాసరావు, డోల బాబ్జీ, మావుడి వాసు నాయుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ రెడ్డి పద్మావతి మాట్లాడారు. మక్కువ మండలం అధ్యక్షుడు మావుడి రంగు నాయుడు,పట్టణ అధ్యక్షుడు వంగపండు అప్పల నాయుడు, అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు జర్జాపు ఈశ్వరరావు, మెంటాడ మండల నాయకులు ఈశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

పని ప్రాంతాల్లో సౌకర్యాలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ఉపాధి హామీ పని ప్రాంతాల్లో సౌకర్యాలు కల్పిస్తున్నట్లు డ్వామా పీడీ కె.రామచంద్రరావు తెలిపారు. గరుగుబిల్లి మండలంలో గొట్టిపలని, రావుపల్లి, ఇతర పంచాయతీల్లో చేపడుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి నెల వరకు వరకు ప్రతి వేతనదారుడికి వేతనం ఖాతాల్లో జమ చేశామన్నారు. మార్చిలో చేసిన పనికి మాత్రం వేతనం జమ కావలసి ఉందని స్పష్టంచేశారు. మార్చికి సంబందించిన బిల్లులు (ఎఫ్‌టిఒ)లను ఎప్పటికప్పుడు ఎన్ఐసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసినట్లు చెప్పారు. మండలంలో చేపడుతున్న ప్రతి ఉపాధి హామీ పని దగ్గర అందుబాబులో ఉన్న పాత టెంట్లు ఏర్పాటు చేశామన్నారు. మెడికల్ కిట్లు అందుబాటులో ఉన్న ప్రతి పంచాయతీలో పని ప్రాంతం ఉంచుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ సూచనల మేరకు ప్రతి గంటకి వాటర్ తాగడానికి వాటర్ బెల్ మాదిరి కాన్సెప్ట్‌తో ఒక పది నిమిషాల పాటు నీరు తాగడానికి అనువుగా పనిని ఆపుతున్నట్లు చెప్పారు.

పట్టణంలో టిడిపి ఎన్నికల ప్రచారం


ప్రచారం చేస్తున్న టిడిపి అభ్యర్థి విజయచంద్ర

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

పార్వతీపురం మున్సిపాలిటీ పరిధిలో బుధవారం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయచంద్ర ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. 2వ వార్డులోని గడివీధి, 28వ వార్డు దుగరాజుపేటలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో వైసిపిపై తీవ్ర వ్యతిరేకత ఉందని, ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఈసారి పార్వతీపురంలో వైసిపి ఘోరమైన పరాజయం చూస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బార్నాల సీతారాం, సిరిపురపు భాస్కరరావు, జి.రవికుమార్, గొట్టాపు వెంకటనాయుడు, నాయకులు పాల్గొన్నారు.

మండలంలోని చినమరికి, పెదమరికి పంచాయతీల పరిధిలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయచంద్ర ప్రచారం నిర్వహించారు. గ్రామంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ, సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు సొండి సంజీవి, జనసేన నాయకులు ఆగూరు మణి, టిడిపి నాయకులు గొట్టాపు వెంకట నాయుడు బార్నాల సీతారాం, బోను చంద్రమౌళి, గుంపస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రజెండా అభ్యర్థులను గెలిపించాలి

ప్రజాశక్తి-కొమరాడ

ఎర్రజెండా తరుపున పోటీ చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మండంగి రమణ, ఎమ్‌పి అభ్యర్థి అప్పలనర్సను గెలిపించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి కోరారు. ఈ మేరకు బుధవారం కొమరాడ, కొత్తవలస, సిశాడవలస గ్రామాల్లో సాంబమూర్తి, సిఐటియు నాయకులు వై.గౌరునాయుడు ఆధ్వర్యాన ప్రచారం చేశారు. రాష్ట్రంలో కుస్తీ పడుతూ, కేంద్రంలో దోస్తీ చేసే పార్టీలను నమ్మొద్దని కోరారు. గిరిజనాభివృద్ధికి పోరాటం చేస్తున్న సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.


ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు సాంబమూర్తి

రాష్ట్రంలో సంక్షేమ పాలన

వైసిపి జిల్లా అధ్యక్షులు పరీక్షిత్ రాజ్

ప్రజాశక్తి-కొమరాడ

రాష్ట్రంలో సంక్షేమ పాలన వైసిపి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని వైసిపి పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు అన్నారు. బుధవారం నాగావళి నది ఆవల ఉన్న కొట్టు, గొడుము, మాదలింగి, దలైపేట గ్రామాల్లో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి ఆధ్వర్యంలో వైసిపి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్పశ్రీవాణితో కలిసి ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు కావాలంటే వైసిపి అధికారంలోకి వస్తేనే సాధ్యమవుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్ధన్, ఎంపిపి శెట్టి శ్యామల, జెడ్‌పిటిసి లక్ష్మి, వైస్ ఎంపిపి శరత్ బాబు, నాయకులు శెట్టి మధుసూదన్ రావు, ఎం.సూరపునాయుడు, కె.మల్లిబాబు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో కుంటుపడిన అభివృద్ధి

ప్రజాశక్తి - కురుపాం

వైసిపి హయాంలో ఏజెన్సీలో అభివృద్ధి కుంటుపడిందని మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి తెలిపారు. బుధవారం కురుపాం కోట ఆవరణలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ ఆధ్వర్యంలో కురుపాం మండల ఉమ్మడి నాయకులు, కార్యకర్తలతో మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్వరి మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం వస్తేనే అభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం ఎన్నికల ప్రక్రియపై దిశా నిర్దేశం చేశారు. మండలంలోని 23 పంచాయతీల పరిధిలో ఉన్న గ్రామాల్లో సమస్యలను నాయకులు, కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్‌పి వైరిచర్ల ప్రదీప్ దేవ్, మండల కన్వీనరు కొండయ్య, వంశీ, నాయకులు కోలా రంజిత్ కుమార్, సుకేష్ చంద్ర పండ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీని సక్రమంగా అమలుచేయాలి

ప్రజాశక్తి-పాచిపెంట

ఉపాధి హామీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సెబి తిరుపతిరావు, అప్పలస్వామి ఆధ్వర్యంలో చిట్టెలభ గ్రామంలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా పనిచేసిన కూలీలకు చట్టం ప్రకారం సకాలంలో డబ్బులు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండల తీవ్రత దృష్టిలో పెట్టుకొని టెంట్లు, మంచినీరు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పనిచేసిన 14 రోజులకే బిల్లులు చెల్లించాలని, లేదంటే నష్టపరిహారం చెల్లించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్‌చేశారు.


నినాదాలు చేస్తున్న గిరిజనులు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

పశువుల వ్యాన్ సీజ్

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

అనుమతులు లేకుండా పశువులను తరలిస్తున్న వ్యానును బుధవారం వెంకంపేట ఘోరీల కూడలిలో తహశీల్దార్ కె.ఆనందరావు సీజ్ చేశారు. సాధారణ తనిఖీలలో భాగంగా వ్యాను ఆపి కాగితాలు పరిశీలించగా, అక్రమంగా తరలిస్తున్నట్లు తేలింది. పట్టణ ఎస్ఐ సంతోషికుమారితో కలిసి వాహనాన్ని ఆదుపులోకి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెంకంపేట కూడలిలో చెక్‌పోస్ట్ ఏర్పాటు

సాధారణ ఎన్నికలలో భాగంగా మద్యం, నగదు, ఆయుధాల అక్రమ రవాణాను నిరోధించడానికి పట్టణ శివారులో నిరంతర నిఘా కోసం చెక్‌ఫోస్టు ఏర్పాటు చేస్తున్నట్లు తహశీల్దారు ఆనందరావు తెలియజేశారు. అందుకు అనువైన స్థల పరిశీలన చేశారు.

27 మంది వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని చలివేంద్రి సచివాలయ పరిధిలో 17 మంది, నర్సిపురం సచివాలయంలో 10 మంది గ్రామ వాలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. వారి రాజీనామాలు ఆమోదించినటుల సచివాలయ కార్యదర్శులు తెలిపారు.

నీటిఎద్దడి నివారణకు ప్రణాళిక

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

జిల్లాలో నీటిఎద్దడి నివారణకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశామని జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ దినపత్రికలలో నీటి ఎద్దడిపై ప్రచురితమైన వార్తలపై ఆయన స్పందిస్తూ జిల్లాలో ప్రస్తుతం అన్ని గ్రామాల్లో సరిపడా నీటి లభ్యత ఉందని తెలిపారు. జిల్లాలో 44 గ్రామాలలో నీటి ఎద్దడి ఉన్నట్లు అంచనా వేశామని చెప్పారు. ఆ మేరకు రూ.23.90 లక్షలతో నీరు సరఫరా చేసేందుకు కార్యాచరణ ప్రణాళికలు తయారు చేశామని వివరించారు. అవసరం మేరకు వెంటనే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తామని చెప్పారు. పాలకొండ మండలం అంపిలి, భామిని మండలం డొంకుల గూడ, సీతంపేట మండలం జొన్నగూడ, జియ్యమ్మవలస మండలం తాలదుమ్మ, కురుపాం మండలం, ఇతర మండలాల్లో జల జీవన్ మిషన్ కింద పనులు చేపట్టామని, కొన్ని పనులు త్వరలో పూర్తవుతాయని చెప్పారు.

శుద్ధ జలాల సరఫరాకు చర్యలు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణ ప్రజలకు శుద్ధ జలాలను సరఫరా చేసేందుకు చర్యలు చేపడతామని మున్సిపల్ కమిషనర్ కె .శ్రీనివాస్ అన్నారు. బుధవారం 'ప్రజాశక్తి' దినపత్రికలో 'వేసవిలోనూ రంగుమారిన నీరు' శీర్షికతో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. రిజర్వాయర్ నుండి ఇన్‌ఫిల్టరేషన్ బావుల వైపు నీటిని మళ్లించేందుకు పనులు చేపడుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగా నీరు రంగు మారిందని చెప్పారు. బావుల చుట్టూ ఇసుక బస్తాలు వేసి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు. పట్టణ ప్రజలకు శుద్ధ జలాలను సరఫరా చేసేందుకు కృషి చేస్తామన్నారు.

పక్కాగా ఎన్నికల కోడ్ అమలు

ప్రజాశక్తి-సీతంపేట

ఎన్నికల కోడ్ నిబంధనలను రాజకీయ పార్టీలు తప్పనిసరిగా పాటించాలని పాలకొండ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కల్పనకుమారి అన్నారు. బుధవారం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుండి నామినేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. నామినేషన్ వేసేటప్పుడు నిబంధనల్లో పేర్కొన్న అన్ని పత్రాలను పొందుపరచాలని సూచించారు. అదే విధంగా రాజకీయ పార్టీల ప్రచారాలకు సంబంధించి ముందస్తుగానే రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతులు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో నాలుగు మండలాల తహశీల్దార్లు, ఇతర ఎన్నికల సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

భద్రగిరి ఐటిఐలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలోని భద్రగిరి ఆర్ఐటిఐలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. డిప్లొమో, డిగ్రీ పాసైన 260 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ ఇంటర్వ్యూలో 200 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సిహెచ్ సునీల్ కుమార్ తెలిపారు. బెంగళూరు టాటా ఐఫోన్ కంపెనీకి మహిళలు, హైదరాబాద్ స్కానేడర్ ఎలక్ట్రిక్ ఇండియా పరిశ్రమలో పురుషులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ రామయ్య, ఎన్ఎస్ఎస్ పిఒ త్రినాథ, మల్టీ నేషనల్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రబీ పంటల పరిశీలన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో వలసబల్లేరు పంచాయతీలో గిరిజన రైతుల రబీ పంటలను జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగ అధికారి షణ్ముఖరాజు బుధవారం పరిశీలించారు. వేరుశనగ, పొద్దుతిరుగుడు పంటలను పరిశీలించి, పురుగు పట్టకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో మోడల్ మేకర్ కె.సన్నిదొర, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ములగలో ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని ములగలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డోకిశిల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఐశ్వర్య రోగులకు వైద్య సేవలు అందించారు. ఈ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్

కొటియాలో ప్రశాంత ఎన్నికలకు ఏర్పాట్లు

కొరాపుట్ జిల్లా అధికారులు అంగీకారం

ప్రజాశక్తి-సాలూరు

వివాదాస్పద కొటియా గ్రామాల్లో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు ఇఆర్ఒ, ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్ చెప్పారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సెక్టార్ అధికారుల, బూత్ స్థాయి అధికారులు, గ్రామ రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కొటియా గ్రామాల్లో ఓటర్లు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు కొరాపుట్ జిల్లా అధికారులు అంగీకరించారని తెలిపారు. ఈ మేరకు రెండు జిల్లాల అధికారుల మధ్య అంగీకారం కుదిరిందని చెప్పారు. దీనిపై బూత్ స్థాయి అధికారులు, గ్రామ రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి సెక్టార్ అధికారి తన పరిధిలో పోలింగ్ కేంద్రాలు, రూట్‌లను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. వాహనాల రాకపోకలు, ఇతర అంశాలపై స్పష్టమైన అవగాహన ఉండాలని స్పష్టంచేశారు. సమాచారం వేగంగా అందించుటకు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ప్రతి సెక్టార్ అధికారి ముందుగానే పరిశీలన చేయాలని ఆదేశించారు. 12, 13, 15 తేదీల్లో నిర్వహించే ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ కేంద్రం - ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం దండిగాం చెక్ పోస్టును తనిఖీ చేశారు. సమావేశంలో నాలుగు మండలాల తహశీల్దార్లు, పాల్గొన్నారు.



సాయి సుప్రియను సన్మానిస్తున్న చైతన్య భారతి సభ్యులు

సాయి సుప్రియకు ఉగాది పురస్కారం

ప్రజాశక్తి - గజపతినగరం

నాట్యం, నటన, వ్యాఖ్యానం తదితర పాత్రలతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన మద్దిల సాయి సుప్రియకు గజపతినగరానికి చెందిన చైతన్య భారతీ సాంస్కృతిక సంస్థ ఉగాది ప్రతిభా పురస్కారాన్ని అందజేసింది. ఈమేరకు స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో జరిగిన ఉగాది ఉత్సవాల్లో ఆమెకు సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బుద్ధరాజు వెంకట శ్రీరాం, బొంతలకోటి శంకరావు గౌరవాధ్యక్షులు వి.కృష్ణారావు చేతులమీదుగా మంగళవారం రాత్రి అందజేశారు. దీనికిముందు ఆమె నాట్యం, హాస్యనటనతో సభికులను అలరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మన (విజయనగరం) జిల్లాకు చెందిన సాయి సుప్రియ కళలపై మక్కువతో ఉన్నత స్థాయికి ఎదగడం అభినందనీయమన్నారు. భరత నాట్యంతో ప్రారంభమైన ఆమె ప్రస్థానం నేడు టీవీ, సినిమాల్లో నటన, ప్రముఖ సాంస్కృక కార్యక్రమాల్లో వాఖ్యానం వరకు వెళ్లిందని వివరించారు. సాయి సుప్రియ కళారంగంలో బహుముఖ పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. విజయనగరం, విశాఖపట్నంలో ఇప్పటికీ నృత్య పాఠశాలలు నడుపుతూ కళలపట్ల ఆమెకున్న అభిరుచిని చాటుకుంటున్నారని వివరించారు. గడిచిన రెండు దశాబ్ధాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులు పొందారని అన్నారు.

రక్తహీనత పిల్లలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

రక్త హీనతపై ప్రజల్లో సంపూర్ణ అవగాహన ఉండాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. పది సంవత్సరాల లోపు పిల్లల్లో మరణాల రేటు నివారణ కార్యక్రమంపై వైద్య అధికారులు, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బందితో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పదేళ్లలోపు పిల్లల్లో మరణాల రేటు నివారణకు ముఖ్యంగా రక్తహీనత నివారణపై దృష్టి సారించాలన్నారు. తల్లి గర్భం నుండే పర్యవేక్షణ ఉండాలని ఆయన స్పష్టం చేశారు. గ్రామ స్థాయి నుండి పర్యవేక్షణ పక్కాగా ఉండాలన్నారు. గ్రామ స్థాయిలో ప్రతి ఇంటా అవగాహన ఉండాలని ఆయన సూచించారు.

సమస్యాత్మక గ్రామాల్లో ఎస్‌పి పర్యటన

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో జిల్లా ఎస్‌పి ఎం.దీపిక బుధవారం పర్యటించారు. పోలిపల్లి, లింగాలవలస గ్రామాల్లో పర్యటించి అక్కడి పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా పోలింగు కేంద్రం వద్ద భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించి, పోలింగు రోజున చేపట్టాల్సిన భద్రత ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. పోలింగు కేంద్రంలో 100 మీటర్ల దూరం వరకు రాజకీయ పార్టీలకు చెందిన ఎటువంటి టెంటులు లేకుండా చూడాలని తెలిపారు. అనంతరం భోగాపురం పోలీసు స్టేషను ను ఆకస్మికంగా సందర్శించారు.రికార్డులు, సిడి ఫైల్స్ తనిఖీ చేశారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా మండలంలోని అన్ని సమస్యాత్మక గ్రామాల్లోను ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాలన్నారు. సమస్యలు సృష్టించే వ్యక్తులను గుర్తించి బైండోవర్ చేసి తాహశీల్దారు కార్యాలయాల్లో వారిని హాజరుపరచి మంచి ప్రవర్తన కొరకు బాండులను తీసుకోవాలని అన్నారు. మండలంలో ప్రహరీ గోడలు లేని పోలింగు కేంద్రాలను గుర్తించి, ఆయా పోలింగు కేంద్రాల వద్ద మరింత కట్టుదిట్టంగా భద్రత ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఎస్‌పి వెంట డిఎస్‌పి ఆర్.గోవిందరావు, భోగాపురం సిఐలు రవికుమార్, బి.వెంకటేశ్వరరావు, ఎస్ఐలు పి.సూర్యకుమారి, సిబ్బంది ఉన్నారు.

క్షుణ్ణంగా వాహన తనిఖీలు చేయాలని ఆదేశం

డెంకాడ : వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని పోలీసు అధికారులకు, సిబ్బందికి ఎస్‌పి ఎం.దీపిక సూచించారు. బుధవారం డెంకాడ మండలం మోదవలస వద్ద సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఏర్పాటు చేసిన అంతర జిల్లా చెక్ పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్ పోస్టు వద్ద పోలీసు అధికారులు, సిబ్బంది, కేంద్ర పోలీసు బలగాలు చేపడుతున్న వాహన తనిఖీలను పరిశీలించారు. తనిఖీలను క్షుణ్ణంగా చేపట్టాలని, పరిమితికి మించి నగదు పట్టుబడితే సీజ్ చెయ్యాలని, ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు వినియోగించే గిఫ్ట్స్, మద్యం, సారా, గంజాయి వంటి వాటి అక్రమ రవాణాను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వాహనాల రికార్డులు, పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ వంటి పత్రాలను పరిశీలించాలన్నారు. ఎస్‌పి వెంట విజయనగరం డిఎస్‌పి ఆర్.గోవిందరావు, భోగాపురం సిఐ రవికుమార్, విజయనగరం సిఐ బి.వెంకటరావు, డెంకాడ ఎస్ఐ కృష్ణమూర్తి ఉన్నారు.

మోదవలస వద్ద చెక్‌పోస్టు తనిఖీ



భోగాపురం పోలీస్ స్టేషన్ లో సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్‌పి ఎం.దీపిక

మిమ్స్ యాజమాన్య వైఖరితో అసంపూర్తిగా ముగిసిన చర్చలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మిమ్స్ ఉద్యోగుల సమస్యలపై బుధవారం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారి వద్ద జరిగిన చర్చలు యాజమాన్య వైఖరి కారణంగా అసంపూర్తిగా ముగిశాయని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బారావమ్మ తెలిపారు. జిల్లాకు చెందిన రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ చొరవతో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారి కార్యాలయంలో యాజమాన్యానికి , మిమ్స్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్‌కు మధ్య చర్చలు జరిగాయని తెలిపారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి మిరప నారాయణరావు, నాయకులు కె.రామనాగేశ్వరరావు, గౌరీ, నెల్లిమర్ల ఎంపిపి అంబల్ల శ్రీరాముల నాయుడు, జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, వైసిపి మండల అధ్యక్షులు చనుమల్ల వెంకటరమణ సమక్షంలో ఈ చర్చల్లో పాల్గొన్నారని తెలిపావు. ఇంతకాలం యాజమాన్యం సిఐటియును చూపించి చర్చలను ఎగ్గొడుతూ వచ్చిందని, సిఐటియు నాయకత్వం తామంతా బయట ఉండి ఉద్యోగులతో మాట్లాడి సమస్యను పరిష్కరించమని కోరామని, అయినా యాజమాన్యం చర్చల మధ్యలో అర్ధాంతరంగా లేచి వెళ్లిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఒకవైపు 24 మంది ఉద్యోగులు జైల్లో మగ్గిపోతుంటే, యాజమాన్యం మాత్రం కార్మిక చట్టాలను ఉల్లంఘించి వేతన ఒప్పందం ఎగ్గొట్టేందుకు ప్రయత్నిస్తుందన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం తమ వైఖరిని మార్చుకొని కార్మికులందరికీ ఆమోద యోగ్యమైన ఒప్పందం చేయాలని, కార్మికులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఆమెతోపాటు సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు నాయకులు ఎ.జగన్మోహన్‌రావు, బి.రమణ, పలువురు మిమ్స్ ఉద్యోగులు పాల్గొన్నారు.

భద్రాచలానికి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈనెల 17న శ్రీరామనవమిని పుర స్కరించుకుని భద్రాచలం సీతారామ చంద్రస్వామి కల్యాణానికి హాజరయ్యే భక్తుల కోసం ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్టు విజయనగరం ఆర్‌టిసి డిపో మేనేజరు జె. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. బస్సు 16వ తేదీ సాయంత్రం 4.30గంటలకు విజయనగరం బస్ కాంప్లెక్స్ నుండి బయలుదేరి 17న ఉదయం 5గంటలకు భద్రాచలం చేరుతుందని తెలిపారు. తిరిగి అదేరోజు సాయంత్రం 5గంటలకు భద్రాచలం నుంచి బయలుదేరి 18వ తేదీ ఉదయం 5.30గంటలకు విజయనగరం చేరుతుందని తెలిపారు. పెద్దలకు రూ. 745, పిల్లలకు రు.400గా నిర్ణయించినట్లు తెలిపారు. టిక్కెట్లు కావలసినవారు అడ్వాన్సు రిజర్వేషన్ చేసుకొనవచ్చుననని తెలిపారు. వివరాలకు 9959225620, 9494331213, 9440359596, 7396807373 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

74 మంది వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి - లక్కవరపుకోట,వేపాడ, డెంకాడ, మెరకముడిదాం

జిల్లాలోని లక్కవరపుకోట, డెంకాడ, వేపాడ, మెరకముడిదాం మండలాల్లో 74మంది వాలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. లక్కవరపుకోట మండలంలోని వివిధ సచివాలయాల పరిధిలో విధులు నిర్వహిస్తున్న 43 మంది వాలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలవల్ల రాజీనామా చేసినట్లు ఈ సందర్భంగా వారు ప్రకటించారు. కొట్యాడ సచివాలయ పరిధిలో 11 మంది వాలంటీర్లు రాజీనామా చేసినట్లు కార్యదర్శి జి గోవిందా తెలిపారు. చందులూరు పరిధిలో 15 మంది రాజీనామా చేసినట్లు సచివాలయ కార్యదర్శి బెహరా శ్రీనివాస్ వెల్లడించారు. రేగ సచివాలయ పరిధిలో 12 మందికి గాను 11 మంది రాజీనామా చేసినట్లు ఆ పంచాయతీ కార్యదర్శి శైలజ చెప్పారు. కోనమసివానిపాలెం నుండి మరో ఆరుగురు వాలంటీర్లు రాజీనామా చేసినట్లు కార్యదర్శి యు తులసీదేవి వెల్లడించారు. **వేపాడ** మండలంలోని వావిలిపాడు గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న 13 మంది వాలంటీర్లు పంచాయతీ కార్యదర్శి కన్నం నాయుడుకు తమ రాజీనామా పత్రాలను అందజేశారు. **డెంకాడ** మండలంలోని పినతాడివాడ సచివాలయానికి సంబందించిన 11 మంది వాలంటీర్లు రాజీనామా పత్రాలను సచివాలయం వద్ద పంచాయతీ సెక్రటరీకు సమర్పించారు. రాబోయే ఎన్నికల్లో వైసిపికి మద్దతుగా ప్రచారం చేస్తామన్నారు. మెరకముడిదాం మండలం గొల్లలవలస పంచాయతీ పరిధిలో ఏడుగురు వాలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపిడిఒ పావని తెలిపారు.



డెంకాడ : రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శికి అందజేస్తున్న వాలటీర్లు

23న స్వతంత్ర అభ్యర్థిగా కర్రోతు నామినేషన్

ప్రజాశక్తి - భోగాపురం

మండల టిడిపి అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ ఈ నెల 23న ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేసేందుకు సిద్ధమయ్యారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నట్లు భోగాపురం గ్రామ పార్టీ అధ్యక్షులు బొడ్డ హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 22 పంచాయతీల మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు ఒత్తిడి మేరకు అయన ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్నట్లు తెలిపారు. తామంతా ఆయనకు అవసరమైన ఆర్థిక సాయం కూడా అందజేస్తామని ఇటీవల జరిగిన సమావేశంలో కూడా చెప్పినట్లు తెలిపారు. లోకం మాధవిని కూటమి అభ్యర్థిగా ప్రకటించి 50రోజులు గడిచినా ఆమె ఇంతవరకు టిడిపి మండల అధ్యక్షుడు సత్యన్నారాయణను కలవలేదని, పార్టీ నాయకులు కార్యకర్తలను పట్టించుకోలేదని ఇటీవల ఆయన ఇంటి వద్ద జరిగిన సమావేశంలో నాయకులు, కార్యకర్తలు బాహాటంగానే విమర్శించారన్నారు.

టిడిపిలో 42 ఏళ్ల నుంచి ఉన్న ఆయనకే విలువ లేనప్పుడు తమందరి పరిస్థితి ఏంటో తెలియడం లేదని అన్నారు. ఇటీవల భోగాపురం పంచాయతీలో ఆమె ఒకరోజు ప్రచారం చేసినప్పటికీ కనీసం తమ ఎవరినీ సంప్రదించలేదన్నారు. ఈ నేపథ్యంలో ఆయనతో ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేసి పోటీ చేసేందుకు సిద్ధమయ్యామని తెలిపారు.